ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 17 సెప్టెంబరు 2025

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

● రెండవరోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



సీఎం సదస్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్

రాయచోటి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి కలెక్టర్ల పాత్ర ఎంతో కీలకమని, అన్నమయ్య జిల్లాలో చిరుధాన్యాలు, ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 15, 16 తేదీలలో సీఎం అధ్యక్షతన అమరావతిలో జరిగిన నాల్గవ కలెక్టర్ల సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కనుబిలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాలో బొప్పాయి, టమోటా, మామిడి వంటి ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల ట్యాంకులు ఎక్కువగా ఉన్నాయని, వీటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుని రైతులకు నీరు అందించాలన్నారు. జిల్లాలో రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాల కఫేలను ఏర్పాటు చేసి చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన సంజీవిని, ఎన్‌ఐడీఎస్ ప్రాజెక్టులను పరిశీలించి అమలు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమయ్యే భూమిని వైద్య ఆరోగ్యశాఖకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. రెండవ రోజు సదస్సులో కలెక్టర్లతో పాటు ఎస్పీలను ఆహ్వానించారు.

మహిళను మోసం చేసిన కేసులో

నిందితుడికి జీవిత ఖైదు

● రూ.80 వేలు జరిమానా



నిందితుడిని కోర్టులో ప్రవేశపెడుతున్న పోలీసులు


ఓబులవారిపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళను మోసం చేసిన కేసులో నిందితుడికి జరిమానాతో పాటు, జీవితఖైదు ఖరారు చేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. మండలంలోని రాళ్లచెరువుపల్లె కొత్తపల్లెకు చెందిన 22 ఏళ్ల మహిళతో పాపిరెడ్డిపల్లెకు చెందిన దాంట్ల విజయ్‌కుమార్ సహజీవనం చేశాడు. పెద్దఓరంపాడులోని సిద్దులయ్యస్వామి దేవాలయం వద్ద వివాహం జరిగినట్లు ఆ గ్రామ పెద్దలను నమ్మించాడు. గ్రామ పెద్దలు ఈ విషయంపై విచారణ చేయగా అప్పటికే విజయ్‌కుమార్‌కు వేరొక మహిళతో వివాహమైన విషయం బయట పడింది. ఈ నేపథ్యంలో గర్భిణిగా ఉన్న మహిళ మెడలోని తాళిబొట్టు కాళ్లమెట్టెలు బలవంతంగా లాక్కుని.. కడుపులో ఉన్న బిడ్డను చంపేస్తానని బెదిరించడంతో బాధితురాలు 2020లో ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ప్రస్తుతం కడపలోని ఏడవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి రమేష్‌కుమార్ సెక్షన్ 376(2)(ఎన్), 493, 496, 420 ఐపీసీ ప్రకారం నిందితుడికి రూ.80 వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేశ్ తెలిపారు. ఈ కేసును తక్కువ సమయంలో పరిష్కరించినందుకు పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందం, కోర్టు పోలీసులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అభినందించారని ఎస్ఐ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి రూ.7.23 కోట్లు

● టీటీడీ బోర్డు అధ్యక్షుడు బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్

కలికిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని రెండు ప్రధాన ఆలయాల అభివృద్ధి కోసం మొత్తం రూ.7.23 కోట్లు నిధులు విడుదల చేసేందుకు టీటీడీ నిర్ణయించింది. ఆ మేరకు టీటీడీ బోర్డు అధ్యక్షుడు బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సంయుక్తంగా ప్రకటించారు. మంగళవారం జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో వాల్మీకిపురంలోని పట్టాభిరామస్వామివారి ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక, కల్యాణ మండపం, ఆలయ రాజగోపురం, ఆర్చి (ముఖద్వారం) తదితర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.5.73 కోట్లు, ఇక తరిగొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిని పునర్నించేందుకు రూ.1.50 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

గత ప్రభుత్వంలో అధికారులను బెదిరించి బిల్లులు పెట్టుకోవడం.. అభివృద్ధిని తుంగలో తొక్కేయడం అలవాటుగా మారింది. దానినే ఇప్పుడూ కొందరు నేతలు అనుసరిస్తున్నట్లున్నారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి ఒక ఎత్తు అయితే ప్రస్తుతం మండలంలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీలో జరిగింది మరో ఎత్తు. ఏకంగా పంచాయతీ సెక్రటరీ ఇచ్చిన చెక్కునే మార్ఫింగ్ చేసి డ్రా చేసిన ఘటన చోటుచేసు కుంది. అప్రమత్తమైన సంబంధిత అధికారి పై అధికారులకు తెలియజేసి డ్రా చేసిన వ్యక్తి అకౌంట్‌ను బ్లాక్ చేయించారు. అయితే అప్పటికే రూ.20 వేలు నగదు డ్రా చేసినట్లు వారు తెలిపారు. వివరాల్లోకెళ్తే..




చెక్కు మార్ఫింగ్...
నిధులు స్వాహా

● ఇచ్చింది రూ.20 వేల చెక్కు డ్రా చేసింది రూ.2.20 లక్షలు
● పంచాయతీ కార్యదర్శికి హార్ట్‌స్ట్రోక్
● అధికారులకు బెదిరింపులు

సుండుపల్లె, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులు గ్రామ పంచాయతీ అకౌంట్‌లో ఉంటే కొంత మంది ప్రజాప్రతినిధులు, వారి బంధువులకు నిద్ర పట్టదు. ఎలాగైనా ఆ నిధులను డ్రా చేసి అందినకాడికి దోచేయడం గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఉంది. గత ప్రభుత్వంలో మాదిరిగా అధికారులను బెదిరించి వారు వినకపోవడంతో కొత్త ఎత్తుగడకు పెద్దినేనికాలువ సర్పంచ్ తనయుడు (వరుసకు) ఏకంగా ప్రభుత్వ చేసినందుకు గానూ సర్పంచ్ సంతకంతో కూడిన చెక్కును అందజేశారు. అయితే ఆ పంచాయతీలో అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఎలాగైనా కాజేయాలని సర్పంచ్ బంధువు పసుపులేటి నాగేంద్ర రూ.20 వేల చెక్కును రూ.2.20 లక్షల అంకెలు మార్చి నగదును తన సొంత అకౌంట్‌లోకి జమ చేసుకున్నాడు. ఈ విధంగా గతంలో కూడా ఫోర్జరీలు చేసి ప్రభుత్వ సొమ్మును కాజేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



పెద్దినేనికాలువ గ్రామ సచివాలయం


Canara Bank
Pay P. Nagendra Pasupulati
Rupees Two lakh twenty thousand rupees only
₹ 2,20,000
31992210018047
Panchyathi Secretary Peddinenikaluva (G.P) T. Sundupalli (Mdl) Annamayya (Dist)
Panchayath Sarpench (G.P.), T.Sundupalli (Mdl). Y.S.R. (Dist).
TRANSFER

రూ.20 వేల చెక్కును రూ.2.20 లక్షలుగా మార్చిన దృశ్యం

డ్రా చేసి బెదిరింపులు

రాసిన రూ.20 వేలు చెక్కు కంటే అదనంగా రూ.2 లక్షలు డ్రా చేశారని పంచాయతీ కార్యదర్శి చెప్పగానే వెంటనే డ్రా చేసిన వ్యక్తి అకౌంట్ బ్లాక్ చేయించాను. బ్లాక్ చేయించిన వెంటనే నన్ను ఫోన్ చేసి బెదిరించాడు. నువ్వు ఏం చేసు కుంటావో చేసుకోపో నిధులు డ్రా చేయడం నేరం కాదా అని నేను నాగేంద్రను ప్రశ్నించాను. మీ అంతు చూస్తా మీరు ఎలా ఉద్యోగం చేస్తారో చేయండి అని బెదిరిస్తున్నాడు.

\- సురేశ్‌బాబు, ఈవోపీఆర్‌డీ, సుండుపల్లె

ధన దాహానికి అధికారులు బలి

రాజకీయ నాయకుల ధన దాహానికి అధికారులు బలైపోతున్నారు. గత ప్రభుత్వంలో మండల వ్యాప్తంగా చాలా మంది ఏకగ్రీవంగా సర్పంచులుగా నియామకమయ్యారు. దీంతో ఆ పార్టీ నేతలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. బాగా తినడం మరిగిన వ్యక్తులు అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అడిగినంత బిల్లులు చేయడం లేదని చేసిన దాంట్లోనే ఉన్నదంతా దోచేయాలని అనుకున్నారేమో గానీ రూ.20 వేల చెక్కును రూ.2.20 లక్షలుగా మార్చి నిధులు డ్రా చేయడంతో చరవాణికి మెసేజ్ వచ్చిన వెంటనే పంచాయతీ కార్యదర్శిపై అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంబంధిత అధికారులు నిధులు డ్రా చేసిన వ్యక్తి అకౌంట్‌ను బ్లాక్ చేయించారు. అప్పటికే అకౌంట్ నుంచి రూ.20 వేలు డ్రా చేశారు. చెక్కు మార్చారని తనపై ఎక్కడ నింద పడుతుందో ఏమోనని పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి ఎంపీడీవో కార్యాలయానికి పరుగులు తీశారు. జరిగిందంతా సంబంధిత అధికారులకు తెలియజే సేలోపు గుండెనొప్పితో కుప్పకూలిపోయా రని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. వెంటనే సుండుపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి అనంతరం రాయచోటికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు.

రూ.2 లక్షలు స్వాహా

అధికారులు ఇచ్చిన చెక్కును ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేయడంతో బెంబేలెత్తిపోయి ఓ పంచాయతీ కార్యదర్శికి హార్ట్‌స్ట్రోక్ వచ్చింది.

మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ సర్పంచ్ బంధువు (వరుసకు తనయుడు) అయ్యే పసుపులేటి నాగేంద్ర పేరిట ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రూ.20 వేలు చెక్కు రాసి ఇచ్చారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో పనులు

ఎంపీడీవో ఆఫీసులో కుప్పకూలిపోయాడు

సోమవారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి కుప్పకూలిపోయాడు. గుండె దగ్గర నొప్పిగా ఉందని అరవడంతో వెంటనే ఆసుపత్రికి నేను, ఇతర సిబ్బంది తీసుకెళ్లాము. జరిగిన విషయాన్ని మా సిబ్బంది నా దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఘటన జరగడం బాధాకరం. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

\- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో

ఆసియా స్థాయి పోటీల్లో సత్తా

● గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన కస్తూర్బా విద్యార్థులు



గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మన దేశంలో మొట్టమొదటి సారి హైదరాబాదులోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆసియా స్థాయి తైక్వాండో, కుంగ్‌ఫూ పోటీల్లో ములకలచెరువు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. 13 నుంచి 15వ తేది వరకు జరిగిన ఆసియా స్థాయి పోటీల్లో సుమారు 15 దేశాలకు చెందిన 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. మన రాష్ట్రం తరపున పోటీల్లో పాల్గొన్న కసూర్బా గాంధీ బాలికల విద్యాలయం బాలికలు మేఘసుధ, అమృత, లావణ్య, శ్రావణి, జాహ్నవి, వేదవతి, పవిత్ర, స్పందన అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో తొమ్మిది మంది విద్యార్థులు, ఫైట్ విభాగంలో తొమ్మిది గోల్డ్ మెడల్స్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్‌లో ఐదుగురు బాలికల్లో ముగ్గురు గోల్డ్, సిల్వర్ ఒకరు, కాంస్యం ఒకరు సాధించారు. ఇందులో అమృత, స్పందన, లావణ్యలు ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. నిర్వాహకుల నుంచి ప్రసంశాపత్రాలు, మెడల్స్ అందుకున్నారు. ఆసియా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పలువురు అభినందించారు. పీఈటీ రేష్మ శిక్షణతో ప్రతిభ చూపామని విద్యార్థులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

● రూ.20 వేలు జరిమానా



నిందితుడితో పోలీసులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు జడపాల వెంకట్రమణకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ కడప జిల్లా ప్రధాన కోర్టు న్యాయమూర్తి యామిని మంగళవారం తీర్పు ఇచ్చారు. సంబేపల్లె మండలానికి చెందిన బాలిక తల్లి ఫిర్యాదు మేరకు జడపాల వెంకట్రమణ అలియాస్ రమణపై 2021 నవంబరు 5న రాయచోటి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో సీఐ రాజు, ప్రస్తుత సీఐ బీవీ చలపతి, జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వేణుగోపాల్, ఏఎస్ఐ రాజగోపాల్‌రెడ్డి, కానిస్టేబుల్ విశ్వనాథ్ కేసు దర్యాప్తును పూర్తి చేసి జిల్లా ప్రధాన కోర్టుకు అప్పగించగా, కేసు పూర్వాపరాలను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకట్రమణకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని తీర్పునిచ్చారు. బాధితులకు న్యాయం చేయడంలో కృషి చేసిన పోలీసులు, ప్రాసిక్యూషన్ బృందం, కోర్టు సిబ్బందిని ఎస్పీ ధీరజ్ కునుబిలి ప్రశంసించారు. మహిళల భద్రత కోసం కఠిన చర్యలు, వేగవంతమైన విచారణ, గుడ్‌ట్రయల్ మానిటరింగ్ కొనసాగుతుందని తెలిపారు.



నీటిసంపులో పడి విద్యార్థి మృతి

● మిన్నంటిన కుటుంబీకుల రోదనలు

6

నేడు యాత్రి సేవా దివస్

● విమానాశ్రయం విస్తరణకు చర్యలు
● ఏప్రిల్‌లో అందుబాటులోకి దేశీయ టెర్మినల్ భవనం
● కడప విమానాశ్రయం డైరెక్టర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్‌కుమార్

కడప ఎన్జీఆర్ సర్కిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయంలో బుధవారం యాత్రి సేవా దివస్ నిర్వహించనున్నామని కడప విమానాశ్రయ డైరెక్టర్ సుజిత్‌కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయా ల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం స్థానిక విమానాశ్రయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రణాళిక ప్రకారం కడప విమానాశ్రయంలో ప్రయాణించే వారికి తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు రక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు డ్రాయింగ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు కడప విమానాశ్రయం లోని టెర్మినల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కడప విమానాశ్రయం రెండో ప్రపంచ యుద్ధం నాటిదన్నారు. దీనిని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసి 2015 జూన్ 7న వాణిజ్య విమానాల రాకపోకలను ప్రారంభించిందన్నా రు. మొదట కడప-బెంగ ళూరు మార్గంలో ఎయిర్ పెగాసెస్ ద్వారా విమానాలు నడిపారని తరువాత ట్రూజెట్ ఎయిర్‌లైన్స్ 2017లో ఉడాన్ ఆర్‌సీఎస్ కింద చెన్నై, హైదరాబాదు, విజయవాడ, బెల్గాం నగరా లను అనుసంధానంగా విమాన సర్వీసులు ప్రారంభించిందన్నారు. ఆ తరువాత ఇండిగో ఎయిర్‌లైన్స్ కడప నుంచి బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖ, హైదరాబాదు వంటి ప్రధాన నగరాలకు రెగ్యులర్ సర్వీసులను నడుపుతోందన్నారు. డిమాండ్‌ను పరిగణన లోకి తీసుకుని ఇటీవల కడప విమానాశ్రయాన్ని విస్తరించేం దుకు చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఏ321 విమానాల కోసం మొత్తం ఏడు పార్కింగ్‌బేలు 2022 అక్టోబరు లో ప్రారంభించామన్నారు. ఏ321 విమానాలు ఉంచడానికి వీలుగా 1719 మీటర్ల నుంచి 2515 మీటర్ల వరకు రన్‌వేను విస్తరించి 2023 ఫిబ్రవరిలో ప్రారంభించామ న్నారు. ప్రస్తుతం వేయి చదరపు మీటర్ల నుంచి 2500 చదరపు మీటర్ల వరకు టెర్మినల్ ఉందని దీనిని 16,455 చదరపు మీటర్ల మేర విస్తరించనున్నట్లు తెలిపారు. 1800 మంది ప్రయాణికుల రద్దీ సామర్థ్యానికి అనుగుణంగా నూతన టెర్మినల్ ఉంటుం దన్నారు. నూతన దేశీయ టెర్మినల్ భవనం 2026 ఏప్రిల్‌లో అందుబాటులోకి వస్తుంద న్నారు. కడప విమానాశ్రయంలో రాత్రి ల్యాండింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

పద్మా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఉత్తర్వుల మేరకు 2026 పద్మా అవార్డులు (పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ)లకు సామాజిక సేవా రంగంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈవో విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీలోపు పోస్టు ద్వారా గానీ నేరుగా గానీ సమర్పించాలని, ఏడబ్ల్యూఈఆర్ డీఎస్.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా చేసుకొనే వెసులుబాటు ఉందని తెలిపారు. అర్హులైన వారి నామినేషన్లను కలెక్టర్ ఆమోదంతో తదుపరి చర్య తీసుకుంటామని, వివరాలకు స్టెప్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు 9949298810 నెంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.


ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్ రద్దు

● బాధితులకు న్యాయం చేసిన ఆర్డీవో సాయిశ్రీ
● సంతోషం వ్యక్తం చేసిన బాధితులు

7



పెన్నా ఒయ్యారం.. పొలం సింగారం





ఇటీవల కురిసిన వర్షాలకు బీడు భూములు.. కొండలు పచ్చదనం సంతరించుకున్నాయి. ఎగువ నుంచి వరద రావడంతో పెన్నా పరవళ్లు తొక్కుతోంది. పెన్నా పరీవాహక ప్రాంతమంతా వరిపైరుతో పచ్చగా కళకళలాడుతోంది. సిద్ధవటం మండలం లింగంపల్లి, బండికనుమ ప్రాంతాలు సంధ్యవేళ ప్రకృతిప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఒంపుసొంపులతో ఒయ్యారంగా ప్రవహిస్తున్న పెన్నానది.. కనుచూపుమేరా పచ్చదనం సింగారించుకున్న పుడమితల్లి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించేందుకు పలువురు ఇక్కడకు వస్తున్నారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఆదర్శరైతుకు జీవిత సాఫల్య పురస్కారం



ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ వ్యవసాయ శాస్త్ర సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఆసియా పీజీపీఆర్ (మొక్కల పెరుగుదలను ప్రోత్స హించే రైజో బ్యాక్టీరియా) జాతీయ సదస్సులో కోడూరు ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు, యూఎస్ఏ, యూకే, హంగేరి వంటి దేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. మొక్కల పెరుగుదలను ప్రోత్సహించే రైజో బ్యాక్టీరియా అంశంపై జరిగే ఈ సదస్సు, కొత్త ఆవిష్కరణలు, పరిశోధన ఫలితాలు, భవిష్యత్తు అవకాశాలపై చర్చించడానికి ఒక వేదికగా నిలిచింది. ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు వ్యవసాయ రంగంలో, ముఖ్యంగా పీజీపీఆర్ పరిశోధన, అభివృద్ధిలో చేసిన అసాధారణ కృషి, రైతులకు అందించిన మార్గదర్శకత్వం, కొత్త సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడంతో ఆయన పోషించిన ప్రముఖ పాత్ర గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. కోడూరు ప్రాంతానికి అరుదైన గౌరవం తీసుకొచ్చిన ఆదర్శ రైతు రామరాజుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి

- అడిషనల్ ఎస్పీకి సీపీఐ నేత మొర



సెల్వన్‌కుమార్ భార్యను విచారిస్తున్న ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే

పుల్లంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారుల నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ మండల పరిధిలోని దళవాయిపల్లె హరిజనవాడకు చెందిన మండల సీపీఐ కార్యదర్శి సెల్వన్ కుమార్ భార్య ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు రోజుల క్రితం ఆ కుటుంబంపై దాడి చేసినట్లు నమోదైన కేసుపై మంగళవారం రాజంపేట అడిషనల్ ఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే దళవాయిపల్లె హరిజన వాడలో విచారణ చేశారు. ఈ సందర్భంగా దాడికి కారణాలను, ఎంతమంది పాల్గొన్నారు. ఏ సమయంలో జరిగింది అనే విషయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సెల్వన్ కుమార్ భార్య మాట్లాడుతూ తమకు ప్రాణ భయం ఉందని కాపాడాలని మొరపెట్టుకున్నారు. మీరు భయపడవద్దని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా చూస్తామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. దాడిలో దెబ్బతిన్న బైకు, ఆటో, కారును కూడా ఆయన పరిశీలించారు. అనంతరం బాధితులను పుల్లంపేట స్టేషన్‌కు పిలిపించి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సీఐ బీవీ రమణ, ఎస్ఐ శివకుమార్‌లు పాల్గొన్నారు.

టమోటాలను గిట్టుబాటు ధరకు కొనండి

- మార్కెట్ కమిటీ కార్యదర్శి సూచన



సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టమోటాలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. టమోటా ధరలు తగ్గిపోవడంతో మార్కెటింగ్ శాఖ కమిషనర్ సునీత ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో టమోటా కొనుగోలు చేసే బయటి రాష్ట్రాల వ్యాపారులతో మాట్లాడుతూ రైతులు నాణ్యమైన టమోటాలు మార్కెట్‌కు తీసుకొస్తున్నారని, మంచి ధరలకు టమోటాలు కొనుగోలు చేయాలన్నారు. అక్టోబరు మొదటి వారంలో టమోటా ధరలు పెరిగే అవకాశం ఉందని కార్యదర్శికి తెలియజేశారు. సమావేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కర్ణాటక గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మిశ్రా, విక్రమ్, జగదీష్, గోవిందు, శంకర్, సనావుల్లా, రఫిక్, రాజుభాయ్, మింటు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3,93,869

నందలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,93,869 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. 30 రోజుల అనంతరం హుండీని లెక్కించామని, వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

షరతులు లేని వాహనమిత్ర అమలు చేయాలి

- ఏఐటీయూసీ నేతల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా ఆటో నడిపే ప్రతి డ్రైవర్‌కు వాహనమిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ముబారక్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వాహనమిత్ర రూ.15 వేలు ఇస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహనమిత్ర పథకం అన్నారు. ఇప్పుడేమో ఓనర్ కమ్ డ్రైవర్‌కు అంటున్నారు. రాష్ట్రమంతా పెద్ద ఎత్తున జరుగుతున్న ఆటో డ్రైవర్ల ఉద్యమాన్ని చల్లార్చడం కోసం వాహనమిత్ర పథకం అమలు తేదీ ప్రకటించారన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు 50 శాతం సబ్సిడీతో విద్య, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు, చంద్రన్న బీమా ద్వారా సహజ మరణం చెందిన డ్రైవర్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అపరాధ రుసుం పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేస్తామని చెప్పిన పాలకులు ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని, 60 ఏళ్ల వయసు పైబడిన ఆటో డ్రైవర్‌కు సంక్షేమ బోర్డు నుంచి నెలకు రూ.8 వేలు పింఛన్ ఇవ్వాలని, మదనపల్లె, రాజంపేట, పీలేరు ఆర్టీవో కార్యాలయాల్లోనే ఎఫ్‌సీ సేవలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫైనాన్సియర్ల ఆగడాలు అరికట్టి, ప్రభుత్వమే వాహనాలకు ఐదు శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, నరసింహులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గంగులప్ప, కరీముల్లా, వస్తాన్, రమణ, శివయ్య, నాగరాజు, చంద్ర, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

నీటిసంపులో పడి విద్యార్థి మృతి

- మిన్నంటిన కుటుంబీకుల రోదనలు





రోదిస్తున్న కుటుంబసభ్యులు, (ఇన్‌సెట్లో) నీటిసంపులో పడి మృతిచెందిన కళ్యాణ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీటిసంపులో పడి ఓ బాలుడు తుదిశ్వాస విడిచిన దుర్ఘటన మంగళవారం బి.కొత్తకోట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని పీటీఎం రోడ్డులోని ఆస్పత్రి సమీపంలో నివాసం వుంటూ తోపుడుబండిలో పళ్లవ్యాపారం చేసుకుంటున్న ఈశ్వరప్ప కుమారుడు కళ్యాణ్(8) సమీ పంలో వున్న ప్రభుత్వపాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకుంటా నని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. స్నేహితు లతో ఆడుకుంటూ రోడ్డుపక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోని నీటిసంపులో పడి పోయాడు. తమతో పాటు ఆడుకుంటున్న కళ్యాణ్ కనిపించక పోవడంతో పిల్లలు వెళ్లి బాలుడి తల్లితండ్రులకు తెలిపారు. దీంతో కుటుంబీకులు ఆచూకీ కోసం వెతకగా నీటిసంపులో పడివుండడాన్ని గమనించారు. హుటాహుటిన బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. దీంతో తల్లితో పాటు కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. బంధుమిత్రుల ఆర్త నాదాలతో ఆస్పత్రి ఆవరణం హోరెత్తింది. అకస్మాత్తుగా జరిగిన ఘటనలో బిడ్డను కోల్పో యిన తల్లిదండ్రులను ఓదార్చడం కష్టసాధ్య మైంది. ఘటనపై బి.కొత్తకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్టేషన్‌లోనే మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యశోద

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘంలో తీసుకున్న అప్పు డబ్బులు భర్త చెల్లించలేదని తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ మంగళవారం సాయంత్రం మదనపల్లె తాలూకా పోలీసు స్టేసన్‌కు వచ్చింది. అక్కడ పోలీసులు అప్పు మొత్తం తననే కట్టాలని చెప్పారంటూ ఆవేదనకు గురైన ఆమె వెంట తెచ్చుకున్న పురుగుల మందును పోలీస్‌స్టేషన్ వద్ద తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే బంధువులు ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు.. నల్లగుట్లపల్లెకు చెందిన మల్లికార్జున భార్య యశోద లక్ష్మీవేంకటేశ్వర మహిళా గ్రూప్ లీడర్‌గా ఉంది. భర్తకు వైద్యం నిమిత్తం, ఇల్లు కట్టుకోవడానికి తమ గ్రూప్‌లో రూ.4 లక్షలు రుణం తీసుకుంది. అనంతరం భార్య భర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ద్వారా వారు విడిపోయారు. డ్వాక్రా రుణాన్ని భర్తే చెల్లించాలని ఆ సమయంలో చెప్పారు. ఇంటర్ చదువుతున్న కుమారుడు గణేష్, 13 ఏళ్లన్న కుమార్తె లిఖిత తండ్రి వద్దే ఉన్నారు. భర్త డ్వాక్రా రుణం చెల్లించకపోవడంతో గ్రూప్ సభ్యులు ఆమెను నిలదీశారు. దీంతో ఆమె భర్తపై ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వచ్చింది. అక్కడ సీఐ కళా వెంకటరమణ ఇది సివిల్ కేసు మీరు కోర్టులో తేల్చుకోమని సలహా ఇచ్చారు. కాగా.. ఇంట్లో ఉన్న బంగారు, డబ్బు ఆమె తీసుకెళ్లిందనేది భర్త ఆరోపణ. ప్రస్తుతం ఇల్లు తన పేరిట రాసి ఇవ్వాలనే దురుద్దేశంతో తనను బెదిరించడానికి ఇలా చేసిందని భర్త పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు...



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామం, దిగువ నంబూవారిపల్లె వాసి గోపి కుమారుడు అనిల్ డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చెండకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి ప్రథమచికిత్స కోసం తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపు కేసు నమోదు

ముద్దనూరు సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోడిగాండ్లపల్లె గ్రామానికి చెందిన కర్నాటి వరలక్ష్మిని ఆమె భర్త రమణారెడ్డి వేధింపులకు గురిచేస్తుండడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. అదనపు కట్నం కోసం రమణారెడ్డి, బంధువైన నాగలక్ష్మి వేధిస్తున్నారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని విద్యార్థి సుక్షిత్ (22) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, ఆరోగ్యవరం వాసులు సందీప్, తల్లి రుక్మిణీ కుమారుడు సుక్షిత్. కాగా 15 ఏళ్ల కిందట తండ్రి మరణించడం, తల్లి ఇల్లు వదిలి వెళ్లిపోవడంతో తన అవ్వ సుగుణమ్మ వద్దే ఉంటూ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజు కళాశాలల్లో అందరితో బాగా కలివిడిగా ఉండేవాడని మిత్రులు చెబుతున్నారు. అయితే ఏమైందో ఏమో మంగళవారం తెల్లవారుజామున ఆరోగ్యవరంలో తన అవ్వ ఇంట్లో బాత్ రూమ్‌లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం మదనపల్లె తాలుకా పోలీసులకు తెలియడంతో వారు సంఘటన స్థలం పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి మృతి అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడు ..



వృద్ధుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సోమవారం పోలీసులకు సమచారం అందించారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, సమాచారం కోసం వెదికారు. ఏమి లభించకపోవడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తమ బంధువుల కోసంగుర్తు తెలియని మృతదేహం వేచిఉంది. ఇతని వయస్సు సుమారుగా 80 ఏళ్లు ఉంటాయని, పెరిగి మాసిన గడ్డంతో, లుంగీ, షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..



జయమ్మ (ఫైల్ ఫొటో)

కలకడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరాయ చెరువు-మర్రిపాడు మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు జయమ్మ (60) మృతి చెందినట్లు ఎస్ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కదిరాయచెరువు వాసి జయమ్మ పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొందన్నారు. తీవ్ర గాయలపాలైన బాధితురాలిని 108లో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు.

పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



పిడుగుపాటుకు ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కురబలకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగ ళ్లలో పిడుగుపాటుకు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి జరిగిన సంఘటన వివరాల్లోకెళితే... రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయితే అర్ధరాత్రి కడపరోడ్డులో రోడ్డు పక్కన పిడుగు పడింది. దీంతో బ్రాహ్మణొడ్డుపల్లె, భారత్ కళ్యాణ మండపం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమవడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాగా ట్రాన్స్‌కో సిబ్బంది వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి మర మ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెలో వర్షానికి విద్యుత్ స్తంభం నేల కూలింది.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

కురబలకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కురబలకోట జడ్పీహైస్కూల్ విద్యార్థిని షహనాజ్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. కురబలకోట వాసి రఫి కుమార్తె షహనాజ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మదనపల్లెలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైంది. కాగా విద్యార్థిని సత్య సాయి జిల్లా హిందూపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థిని ఎంఈఓ ద్వారకనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

బండ బరువులు మోస్తున్నా...

● శ్రమకు తగ్గ ఫలితం లేదు ● హమాలీల ఆవేదన



కమలాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీలు బండ బరువులు మోస్తున్నా వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడంలేదు. రేషన్ షాపులకు సంబంధించి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను దింపడం, ఎత్తడం వీళ్ల చేస్తుంటారు. గోడౌన్లలో ఆన్‌లోడింగ్ చేయడం, వాటిని తిరిగి వాహనాల్లోకి లోడు చేసి సంబంధిత చౌక ధాన్యపు డిపోల్లో దింపే పనులను వీరు చేస్తున్నారు. ఒళ్లు గుళ్ల చేసుకుంటూ బరువులు మోస్తున్నా తమ కష్టానికి తగిన ప్రతిఫలం లేదంటూ హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమలాపురం హెడ్‌క్వార్టరులో స్టాకు పాయింట్లు ఉన్నాయి. ఇందులో 10 మంది హమాలీలు దాదాపు 10 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. గతంలో చౌక ధాన్యం దుకాణాల వద్ద నిత్యావసర వస్తువులను ఆన్‌లోడింగ్ చేసే సందర్భంలో డీలర్లు నేరుగా హమాలీలకు ఆన్‌లోడింగ్ చార్జీలు ఇచ్చేవారు. వీరికి క్వింటాల్‌కు లోడింగ్ అన్‌లోడింగ్‌కు కలిపి రూ.24లు ఇస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో థర్డ్‌పార్టీ ద్వారా బిల్లులను కార్మికుల ఖాతాల్లో వేసే పద్ధతి తెచ్చారు. కొన్ని నెలల తరువాత ఆ పద్ధతి ఆపి ఎవరైతే లారీ కాంట్రాక్టరు ఉంటారో వారి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు. ఈ విధానంలో కార్మికులకు నెలనెలా సక్రమంగా బిల్లులు అందడం లేదని వాపోతున్నారు. గతంలో లాగా ఎఫ్ఎస్ఈ షాపుల వద్ద అన్‌లోడింగ్ సమయంలో నేరుగా డీలర్లే అన్‌లోడింగ్ చార్జీలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హమాలీలు కోరుతున్నారు. ఆన్‌లైన్ రూట్‌మ్యాపింగ్ అని చెప్పి షాపులు మార్చడం వల్ల షాపులు తగ్గి హమాలీలకు వేతనాలు తగ్గాయంటున్నారు. ఇలా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం బస్తాలను లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సి రావడంతో హమాలీలకు ఇబ్బంది మారింది. గతంలో డీలర్ల వద్దనే మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బియ్యాన్ని దింపేవారు. పాఠశాలలు ఇరుకు ప్రాంతంలో ఉండడంతో దారిలేక లారీలు చాలాదూరంగా నిలుపుతున్నారు. ఇప్పటి వరకు వీళ్లకు కూలీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



కష్టపడి పనిచేస్తున్న హమాలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. వీరిని ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ప్రతినెలా 5వ తేదీ వేతనాలు చెల్లించాలి. సరుకు లోడింగ్, ఆన్‌లోడింగ్ విషయంలో హమాలీలపై పని వత్తిడి తగ్గించాలి. 12 రోజుల పని విధానాన్ని అమలు చేయాల్సి ఉంది. మృతి చెందిన హమాలీల కుటుంబాలకు రావాలసిన నష్టపరిహారం, బిల్లులు వెంటనే ఇవ్వాలి. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసి ఆదుకోవాలి.

- జి.నాగేశ్వర్‌రావు, ఏపీ సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకుడు

ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్ రద్దు

● ఉత్తుర్వులు జారీచేసిన ఆర్డీవో సాయిశ్రీ ● సంతోషం వ్యక్తం చేసిన బాధితులు



గిఫ్ట్‌డీడ్ రద్దు చేసిన ఉత్తుర్వులను సీనియర్ సిటిజన్లకు అందజేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఒకే రోజు ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసి బాధితులకు న్యాయం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో తన కార్యాలయంలో సంబంధిత వృద్ధులకు వేర్వేరుగా ఉత్తుర్వులను అందజేశారు. ఇందుకు సంబంధించి ఆర్డీవో తెలిపిన వివరాల మేరకు... జమ్మలమడుగు ఆర్డీవో పరిధిలో నివశిస్తున్న ముగ్గురు వయోవృద్ధులు తమకు అవసరమైన సంరక్షణ, ఆహారం, వైద్యం, సహాయం అందిస్తారని ఉద్దేశ్యంతో వారి జీవిత కాలంలో సంపాదించి కూడబెట్టిన ఆస్తిని గిఫ్ట్‌డీడ్ కింద రాసిచ్చారు. అయితే తమ పిల్లలు తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆస్తులు తీసుకుని వదిలించుకోవాలని చూస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ బాధితులు నాలుగునెలల క్రితం ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో వృద్ధుల బాగోగులను సక్రమంగా చూడని వారి సంబంధీకులకు మెయింటినెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్టు 207 సెక్షన్ 23 ప్రకారం చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేయడంతో పాటు మూడు నెలలుగా వారివారి నివాస ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన శ్రీయపురెడ్డి క్రిష్టారెడ్డి (72) శ్రీయపురెడ్డి సరస్వతమ్మ దంపతులు తమకు అవసరమైన సంరక్షణ, ఆహారం, వైద్యం, సహాయం అందిస్తారని ఉద్దేశ్యంతో తమ కుమార్తె తిరుపతి సిద్ధకుమారి అల్లుడు వీరారెడ్డిలకు 2005 జూన్ 2న గిఫ్ట్ సెటిల్‌మెంట్ కింద 1.85 ఎకరాల భూమిని రాయించారు. అయితే వారికి అవసరమైన సంరక్షణ అందించలేదని, వైద్య ఖర్చుల కోసం బాధి తులు తమ నివాస గృహాన్ని విక్రయించాల్సి వచ్చిందని తమ విచారణలో తేలినట్లు ఆర్డీవో తెలిపారు. అలాగే జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్‌సీ బాలమ్మ (72) సైతం తన బాగోగులు చూస్తారన్న ఉద్దేశ్యంతో తన మూడవ కుమారుడు ఎస్‌సీ విశ్వనాథరెడ్డి, కోడలు పార్వతీకి 2022 సెప్టెంబర్ 9న 3.18 ఎకరాల వ్యవసాయ భూమిని రిజిస్టర్ చేయించారు. అయితే వృద్ధురాలికి వారి నుంచి సంరక్షణ లేదని విచారణలో వెల్లడైందన్నారు. అలాగే దువ్వూరు మండలానికి చెందిన జి.మహమ్మద్‌గౌస్ (74) సంతానం లేని కారణంగా తమ జీవితం చివరి దశలో తన సంరక్షణ ఎలా ఉంటుందోనని.. తన ఆస్తిని (ఇంటిని) సోదరుడి మనువడు మహమ్మద్ తాహీర్, అతని తల్లి గౌసియాకు 2022 డిసెంబర్ 13న గార్డియన్‌షిప్‌లో బహుమతిగా ఇచ్చారు. అయితే వీరి నుంచి బాధితులకు సంరక్షణ లేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు పై ముగ్గురు వృద్ధులకు సంబంధించిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశామని ఆర్డీవో తెలిపారు. దీంతో బాధితులు తమకు న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ గిఫ్ట్‌డీడ్ అనేది వృద్ధులు తమ జీవితాంత సంరక్షణ కోసం ఇచ్చినప్పటికీ.. ఎవరైనా ఆస్తులు తీసుకుని ఇలాంటి ఇబ్బందులు కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను గౌరవించి వారి బాగోగులు చూసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, ఏవో ఇక్బాల్, బాష, రజియా తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహిళ మృతి

● ఇరువురు యువకులకు గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగర పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళ మృతి చెందగా.. ఇరువురు యువకులు గాయపడ్డారు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు... ఖాజీపేట మండలానికి చెందిన ఆదిలక్ష్మమ్మ (60) సొంత పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి బైకులో ఖాజీపేట వెళుతుండగా రెండో గాంధీ బొమ్మ వద్దకు రాగానే ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోసుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. అలాగే కడప మాసాపేటకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బిల్టప్ సర్కిల్ వద్ద మైదుకూరు నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్లు సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అలాగే నాగరామ్ గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'గంగ' కాల్వలో యువకుడి మృతి



కలసపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లారెడ్డిపల్లె దారిలో అంకాళమ్మ గుడి వద్ద ఉన్న తెలుగు గంగ కాల్వలో మంగళవారం స్నానానికి వెళ్లి ఆరవేటి సుబ్రహ్మణ్యం (30) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళితే... ప్రకాశం జిల్లా కంభం మండలం చిన్నకంభం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గత కొద్దిరోజుల నుంచి కలసపాడుకు చెందిన ఓ మేస్త్రీ వద్దకు కూలీ పనులకు వెళ్తున్నాడు. మంగళవారం పనులు లేకపోవడంతో తెలుగుగంగ కాల్వలో తన బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి.. తర్వాత స్నానానికి దిగాడు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు



జమ్మలమడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులో ఎస్ఆర్ పెట్రోలు బంకు సర్కిల్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం బండ్లమూరి డానియేల్ అనే వ్యక్తి చెట్టుకింద నిద్రపోతుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన డానియేల్ ప్రొద్దుటూరుకు వెళుతుండగా నిద్ర వస్తుండటంతో స్కూటర్ పక్కనే పెట్టి బండపై నిద్రపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తల, చేతులపై దారుణంగా కొట్టి సెల్, స్కూటర్ లాక్కుని వెళ్లిపోయారు. స్థానికులు అతన్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శివాలయంలో చోరీ



సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న దొంగ

చక్రాయపేట,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభిరెడ్డివారిపల్లె సమీపాన వెలసిన శివాలయంలో మంగళవారం మధ్యాహ్నం శివాలయంలో చోరీ జరిగినట్లు అర్చకులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలకు వెళితే.... ఆలయ పూజారులు ఉదయం పూజలు ముగిసిన తర్వాత గర్భాలయానికి తలుపులు వేసి వెళ్లారు. ఆ సమయంలో దొంగ కటాంజనాన్ని రాడ్‌తో నెట్టి ఆలయంలోకి ప్రవేశించాడు. ప్రాంగణంలో ఉన్న హుండీలోని దాదాపు రూ.50వేల వరకు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సీసీ ఫుటేజీలో దొంగ స్పష్టంగా కనిపిస్తున్నాడు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

దువ్వూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు, మీర్జఖాన్‌పల్లె పరిధిలో అయిదు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు మంగళవారం విద్యుత్తు శాఖ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. బుచ్చిరంగడు, పట్టాభిరామయ్య, బుచ్చెయ్య, రాంప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి అనే రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని చెప్పారు. ఈమేరకు స్థానిక ఎస్ఐ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు మస్కా

● రూ.10లక్షలతో రీసోర్స్ పర్సన్ పరార్

● పోలీసులను ఆశ్రయించిన సంఘం సభ్యులు



పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన డ్వాక్రా సంఘం మహిళలు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల్లో కూడా మోసాలు, అవినీతికి పాల్పడుతున్నారు. బద్వేలు మెప్మాలో అనేక అవకతవకలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సంఘాల్లో ఉండే సభ్యులకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో మెప్మాలోని రీసోర్స్ పర్సన్‌ల ద్వారా సంఘాలను నడిపిస్తుంటారు. బ్యాంకుల్లో లోన్లు తీసుకోవాలన్నా, కట్టాలన్నా ఆర్పీలే కీలకం. అయితే బద్వేలు మున్సిపాలిటీ పరిధి లోని గౌరీశంకర్‌నగర్‌లో నివాసం ఉండే మహిళలు 10మంది కలసి సరస్వతి గ్రూపు, శంకర్‌గ్రూపు అనే పేరుతో పొదులో ఉన్నారు. అయితే ఆ గ్రూపు ఆర్పీ ఆ మహిళలను బురిడీ కొట్టించి రూ.10లక్షలతో ఉడాయించింది. గ్రూపు సభ్యులు అడిగితే మాటదాటేస్తూ తనకు రాజకీయ అండదండలు ఉన్నాయంటూ బెదిరిస్తూ ఉన్నట్లుండి ఒక్కసారిగా డబ్బుతో ఉడాయించింది. బయటకు మాత్రం రూ.10లక్షలు కనపడుతున్నా.. ఎన్ని లక్షల రూపాయలు స్వాహా చేసిందో తెలియదని.. అధికా రులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజాలు తెలుస్తాయని గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మెప్మా అధికారులకు ఈ వ్యవహారం తెలిసినప్పటికీ కప్పిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పొదుపు సంఘాల మహిళలు బద్వేలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయ గా, కేసు నమోదు చేయకపోవడంపై అంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి నిజానిజాలు తేల్చాలని కోరుతున్నారు.

ఆంధ్ర యువసంకల్ప డిజిటల్ మారథాన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర యువ సంకల్ప 2025 డిజిటల్ మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈవో ఐజె విజయకుమార్ తెలిపారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా యువతకు సృజనాత్మకత ఆవిష్కరణ, బాధ్యతలు వేదికగా వీడియోలను డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఆంధ్ర.యువసంకల్ప.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యత, ఫిట్‌నెస్ మరియు క్రీడలు, డిజిటల్ ఇన్నోవేషన్ అంశాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తిగల 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న యువత పై తెలిపిన వెబ్‌సైట్‌లో ఈనెల 30లోపు నమోదు చేసుకుని సంబంధిత వీడియోను అప్‌లోడ్ చేయాలన్నారు.

వైవీయూలో ముగిసిన ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థుల బోధన నైపుణ్యత, అర్హతలను పరిశీలించారు. ఇంటర్వ్యూలలో సబ్జెక్టు నిపుణులు అనంతపురం ఎస్కెయూ నివర్సిటీ ప్రొఫెసర్ ఎంవీ శ్రీనివాసన్, వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డీన్‌లు ప్రొఫెసర్ పి.రమాదేవి, ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ అధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎదురీదుతున్న కర్నూలు, కడప జట్లు



నికిత్‌గౌడ్, మహేంద్రరెడ్డి, వికాస్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం కర్నూలు, కడప జట్లు ప్రత్యర్థి జట్ల కన్నా వెనకంజలో ఎదురీదుతున్నాయి. వివరాలిలా..

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 103.3 ఓవర్లలో 454 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో నికిత్ గౌడ్ 153 పరుగులు, బాలాజీ 59 పరుగులు చేశా రు. కాగా, కర్నూలు జట్టు బౌలర్ ఖనిష్ ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన కర్నూలు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 236 పరుగుల లోటుతో ఎదురీదుతుంది.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్టు మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 150.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 537 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మహేంద్రరెడ్డి 239 పరుగులు, వికాస్ 109 పరుగులు చేశారు. అనంతరం భారీ స్కోరు లక్ష్యాన్ని అందుకునే క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. ఇందులో విజయ్‌రామిరెడ్డి 59 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో కడప జట్టు మరో 428 పరుగుల వెనుకంజలో ఉంది.

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో
భవ్య గుజరాత్‌యాత్ర

● సోమనాథ్, సబర్మతి వంటి పుణ్యక్షేత్రాలు,చారిత్రక ప్రాంతాలు దర్శనం

● తొమ్మిది రాత్రులు, పదిరోజుల ప్రయాణం

● ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్



బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ అధికారులు, ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేశాఖలో భాగమైన ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భవ్య గుజరాత్ యాత్ర స్పెషల్ రైలును ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ తిరుపతి ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. సోమనాథ్ జ్యోతిర్లింగాలు, సబర్మతి ఆశ్రమం వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రాత్మక ప్రాంతాలను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. భవ్య గుజరాత్ యాత్ర తొమ్మిది రాత్రులు, పది రోజులు కొనసాగుతుందన్నారు. మంగళవారం కడప రైల్వేస్టేషన్ వీఐజీ లాంజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబరు 7 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర స్పెషల్ రైలులో 639 మంది యాత్రికులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, రాణికివావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను దర్శించే అవకాశం ఉంటుందని వివరించారు. అక్టోబరు 7 నుంచి 16 తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. రేణిగుంట నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి రేణిగుంటకు చేరుకుంటుంది.

భోజన వసతి టికెట్ ధర వివరాలు

యాత్రికులకు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, వెజిటేరియన్ భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రతి యాత్రికుడికి ప్రయాణ బీమా కల్పిస్తామని చెప్పారు. టికెట్ ధరలు స్లీపర్ క్లాస్‌కు రూ.18,400, 3వ ఏసీకి రూ.30,200, 2వ ఏసీకి రూ.39,900గా నిర్ణయించారన్నారు. కాగా, టికెట్ బుకింగ్ కోసం బి.యేసయ్య 9281495853, కె.పవన్‌కుమార్ 8287932313 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కడప రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, కమర్షియల్ అధికారి మోహన్‌దాస్, స్టేషన్ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ఖాజీపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆంజనేయపురంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఘర్షణలు లేని గ్రామాలు ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఏవైనా ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి రాకుంటే న్యాయసేనాధికారి సంస్థను సంప్రదించాలన్నారు. నిర్బంధ విద్య, రేషన్‌కార్డులు, సదరంసర్టిఫికెట్, పెన్షన్లు, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, లిటిగేషన్ కేసులు, బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, వికలాంగుల పెన్షన్లు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైదుకూరు సివిల్‌జడ్జి ఖాజామొహిద్దీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఇర్విన్, డీఎస్పీ రాజేంద్రప్రసాద్, తహసీల్దారు ఏవీ రవణమ్మ, సీఐ వంశీధర్, సర్పంచ్ చంద్రశేఖర్, న్యాయవాదులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రబీపైనే రైతుల ఆశలు

- ఎండిపోయిన వ్యవసాయ బావులు
- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం

గాలివీడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పసిడి పైర్లతో కళకళలాడే భూములు సకాలంలో వర్షాలు కురవకపోవడంతో బీళ్లుగా మారిపోయాయి. పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామా పురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాలుండగా 80 శాతం కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, వరి ఎక్కువగా సాగు చేస్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 80 వేల ఎకరాలకు పైగా వేరుశనగ సాగవుతుండగా, 30 వేల ఎకరాలకు పైగా వరి, మిగతా భూముల్లో ఇతర పంటలతో పాటు మామిడి, జామ, సపోటా వంటి తోటలను పెంచుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా వేరుశనగను సాగు చేసిన దాఖలాలు లేవు. వరి కనీసం కనుచూపు మేర కూడా కనపడలేదు. సాధారణగా మే, జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిస్తే వేరుశనగను సాగుచేస్తారు. కానీ ఆ నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో వేలాది ఎకరాలు బీడు భూ ములుగా మారి పోయాయి. సాగు లేకపోవడంతో బతుకు బండి నడపడం భారమై పోతోందని రైతులు వాపోతున్నారు. కనీసం రబీ సీజన్‌లోనైనా వర్షాలు పడితే రైతులకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని వర్షాలు



ఎండిపోయిన మెరగల చెరువు



సాగుకు నోచుకోని వ్యవసాయ భూములు

పడకపోతే ఊరైనా ఖాళీ చేసి వలస వెళ్లిపోవాల్సి ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు.

ఆదాయాన్ని కోల్పోయాం



గతంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసేవాళ్ల. ఒక్కొక్కరం వంద నుంచి 200 బస్తాలు వేరుశనగ పండిచేవాళ్లం. ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడలేదు. దాంతో వేరుశనగ సాగు చేయలేకపోయాం. దీంతో ఆదాయాన్ని కోల్పోయాము.

- పిచ్చయ్య, పూలుకుంట

రబీ సీజనైనా కనికరిస్తుందో.. లేదో?



వర్షాలు పడకపోవడంతో బోర్ల కింద మాత్రమే వేరుశనగ సాగు చేశాం. వరి సాగు లేకుండా పోయింది. రబీలోనైనా వర్షాలు సక్రమంగా కురిస్తే వరి, వేరుశనగ సాగు చేసి కుటుంబాలను పోషించుకుంటాం. అప్పుడూ వర్షాలు పడకపోతే ఊర్లు ఖాళీ చేయాల్సిందే..

- శివప్పనాయుడు, గొట్టివీడు

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుక బడిన తరగతుల సంక్షేమ గురుకుల కళాశాలలో సివిక్స్ గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలి పారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ కాని, జనరల్ అడ్మినిస్ట్రేషన్ కానీ, ఉత్తీర్ణులై బీఎడ్ కలిగిన మహిళలు వారి సర్టిఫికెట్లు, రెజ్యూమ్‌లతో ఈనెల 17 నుంచి 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. డెమో ద్వారా ఎంపిక జరుగుతుందని. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

నేడు వీరబల్లి మండల సర్వసభ్య సమావేశం

వీరబల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ సభాభవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక సమావేశానికి హాజరుకావాలన్నారు.

20న రైల్వే కోడూరు మండల సర్వసభ్య సమావేశం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న రైల్వేకోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీవో ఆర్. నాగి రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు కోడూరు మండల పరిషత్ సభా భవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాధ్యక్షులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధి కారులు పాల్గొంటారని తెలిపారు.

కోడూరు ఎంపీడీవోగా నాగిరెడ్డి



రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోడూరు ఎంపీడీవోగా ఆర్. నాగిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా, కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై కోడూరు ఎంపీడీవోగా నియమి తులయ్యారు.. ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల పరిషత్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఆయన తెలిపారు. కోడూరు ఇన్‌చార్జ్ మండల అధికారిగా పనిచేస్తున్న నాగార్జున పదోన్నతిపై కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌కు సన్మానం



కొండా భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్కిరెడ్డిపల్లె టీడీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డిని అటవీశాఖ డైరెక్టర్ ఎర్రగొళ్ల రెడ్డెయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, లక్కిరెడ్డిపల్లె టౌన్ టీడీపీ నాయకులు మంగళవారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, మహ మ్మద్ రఫీ, సాదుల్లా, రవి, ఆచారి, ఆరీఫుల్లా, బడు గు వాసుదేవుడు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్

నందలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బుధవారం నుంచి స్వస్థనారీ.. సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభమవుతుందని మండల ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ శరత్‌కమల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 18 నుంచి 2వ తేదీ వరకు ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ (సచివాలయం)లలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలి పారు. కావున మహిళలు ఆశావర్కర్లు, లేదా ఆరోగ్య కార్యకర్తలను ఈ కార్యక్రమం జరిగే తేదీలను అడిగి తెలుసుకోవాలని కోరారు.

ఓజోన్ పొరతోనే.. జీవకోటికి మనుగడ

రాయచోటి - నేతాజీ సర్కిల్ , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరతోనే జీవకోటి మనుగడ సాధ్యమవుతోందని పలువురు వక్తలు అన్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బాబాఫకృద్దీన్ ఓజోన్ పొర పరిరక్షణ.. ఆవశ్యకత అంశంపై వ్యాస రచన, వక్తృత్వ, పోస్టర్ ప్రదర్శన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ఆవరణంలో పిల్లలతో మొక్కలు నాటించారు. ఉపాధ్యాయులు శిరీష, విజయలక్ష్మి, రాజాహుసేం, నసీమా, వెంకట్రమణ, బాలాజీ, పీడీ గోపాల్, పద్మజ పాల్గొన్నారు.

పుల్లంపేట: కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అక్బర్‌అలీ, సంస్కృత పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు డీవీ



కొత్తపేట జడ్పీ హైస్కూల్‌లో ఓజోన్‌ను సూచించే విధంగా విద్యార్థుల ప్రదర్శన

సుబ్బారెడ్డి, ఇంద్రావతి తెలిపారు. విద్యార్థులకు ఓజోన్ పొరపై అవగాహన కల్పించారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఓజోన్ పొరకు సంకేతంగా ప్రదర్శన చేశారు. సంస్కృత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పుల్లంపేట నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఓజోన్ పొర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు మల్లికార్జున, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, వెంకటరత్నం, లక్ష్మణుడు, చంద్రశేఖర్, పీడీ సాయిరాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు కొత్త బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, లక్ష్మీకళావతి, సుహాసిని, సోఫియా, గీతారాణి, శ్రీకాంతి, నాగమణి, పెంచల్‌దాసు, చిన్నబాబు, రఫీ పాల్గొన్నారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. పోస్టర్లు, నినాదాలు, వ్యాసరచన, ప్రదర్శనల ద్వారా తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. మండల విద్యాశాఖాధికారి అనంతకృష్ణ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఘనంగా ఆరోగ్యశాఖ మంత్రి జన్మదిన వేడుకలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలను మంగళవారం రాయచోటిలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు శివగంగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందగజపతిరాజు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రేపన శివప్రసాద్, అసెంబ్లీ కోకన్వీనర్ నిర్మల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బయ్యస్వామి, హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డేవిడ్‌సుకుమార్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజంపేట : రాష్ట్ర బీజేపీ ఓబీసీ నాయకులు హిమగిరినాథ్ యాదవ్, పట్టుపోగుల ఆది నారాయణ ఆధ్వర్యంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ మాట్లాడుతూ సత్యకుమార్ విద్యార్థి దశలో రాజకీయాల్లో రాణించడ మేగాక అత్యున్నత దేశ ఉపరాష్ట్రపతి వ్యక్తిగత సహాయుడిగా పనిచేసి ఆయన పనితీరును మెరుగుపరుచుకున్నారన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా రాష్ట్రంలో వైద్యరంగాన్ని పటిష్టం చేయడంలో ఆయన చేస్తున్న కృషి అమోఘమన్నారు. రాష్ట్రమంతటా అన్ని ఆసుపత్రుల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కేంద్రం ద్వారా నిధులు తీసుకువచ్చిన ఘనత సత్యకుమార్‌కే దక్కుతుందన్నారు. నంద్యాల బీజేపీ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ అనిల్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె ప్రభుత్వ వైద్యశాలలో బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు, మండల అధ్యక్షులు ముక్కా రూపేశ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు అనంతరం డాక్టర్ రాజశేఖర్ సిబ్బంది ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్, జ్యూస్ అందజేశారు. ఈ మండల బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీవోఏ (యానిమేటర్ల)ల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని రాజులకాలనీలోని వెలుగు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో యానిమేటర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనీస పద్ధతులు పాటించ కుండా యానిమేటర్లను ఉద్యోగం నుంచి తొలగిస్తుంటే సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు తప్ప, రాజకీయ నేతల అక్రమాలకు అడ్డు చెప్పే ధైర్యం చేయడం లేదని విమర్శించారు. కొంతమంది అధికారులు రికార్డులు అప్పగించాలని సంఘమిత్రలను బెదిరిస్తున్నారన్నారు. అనంతరం యానిమేటర్ల సంఘం జిల్లా నేతలు రాణి, సుబ్రమణ్యం, రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ మాట్లాడుతూ ఎవరినీ తొలగించమని రాష్ట్ర ముఖ్యమంత్రి



ధర్నా చేస్తున్న యానిమేటర్లు

చంద్రబాబు చెబుతుండగా కిందిస్థాయి కూటమి నాయకులు ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోకుండా ప్రజల్లో వ్యతిరేకతకు కారణమవుతున్నారని, చోటా నాయకుల ఆగడాలు అరికట్టకుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీడీ రాజేశ్వరరావుకు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

ఏపీజీఈఏ కృషి

రాయచోటిటౌన్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కట్టుబడి ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 'రండి టీ తాగుతూ చర్చించుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోయినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి ఉన్న రూ.25 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో రిటైరైన ఉద్యోగులకు ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదన్నారు. ఫలితంగా రిటైర్డ్ ఉద్యోగులు వారి పిల్లలకు వివాహాది కార్యక్రమాలు చేసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఓర్సు సాయికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మునియనాయక్, రామచంద్రారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజా తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామా ల్లో మంగళవారం ప్రభు త్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశా రు. కృష్ణంపల్లెకు చెందిన శంకరయ్యకు రూ. 4,01, 415, టి.కమ్మపల్లెకు ఇంది రమ్మకు 40,883, రెడ్డిపల్లెకి చెందిన సుధీర్‌బాబుకు రూ.1,52,214, మల్లోరి పల్లెకు చెందిన సుబ్బమ్మకు రూ.51,853, కేతవాండ్లపల్లెకు చెందిన నారాయణమ్మకు 41,084 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరదతో రోడ్డుకు గండి



కొట్టుకుపోయిన మట్టి రోడ్డు

సుండుపల్లె, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): నీటి ప్రవాహానికి రెడ్డివారిపల్లె, రాయవరం మధ్యలో బాహుదా నదిపై ఉన్న తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. మంగళవారం పింఛా ప్రాజెక్టు ప్రాజెక్టులోకి వరదనీరు రావడంతో నదిలోకి నీటిని విడుదల చేశారు. ఈ ప్రవాహానికి పింఛా బాహుదానదిపై ఉన్న మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతి ఏడాది ఈ రోడ్డు కొట్టుకు పోతుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా వంతెన ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నెట్‌బాల్‌లో చింతరాజుపల్లె విద్యార్థుల ప్రతిభ



నెట్‌బాల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని చింతరాజుపల్లె పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. బ్రాహ్మణపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో ప్రతిభ కనబరచిన ఈ విద్యార్థులు భవిష్యత్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థులు రోహిణి, సుప్రజ, పూజిత, దేవి, బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు వెంకటసాయి, వినోద్‌లు ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థులు అభిలాష్, గౌతమ్, బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని రక్షిత, గౌరి పదో తరగతి విద్యార్థిని బుజ్జి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీ వెంకటసుబ్బయ్యను హెచ్‌ఎం మేరి, పాఠశాల కమిటీ చైర్మన్ రాసాలం నరసింహులు అభినందించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

గాలివీడు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం గాలివీడు- రాయచోటి ప్రధాన రహదారిలోని గ్యాస్ గోడౌన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అర్హత పత్రాలతో పాటు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

విగ్రహావిష్కరణను వ్యతిరేకించడం తగదు

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): కురుబ కుల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసు విగ్రహాన్ని అక్టోబరు 2న రాష్ట్ర బీసీ సంక్షేమ, జవుళి శాఖామాత్యులు, సవిత ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్న విషయం తెలిసిందే. అయితే, కురుబ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడుగా ప్రకటించుకున్న మదనపల్లికి చెందిన జబ్బల శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడాన్ని అన్నమయ్య జిల్లా కురుబ సంఘం తీవ్రంగా ఖండించింది. మంగళవారం స్థానిక మానస రెస్టారెంట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు ఈ మేరకు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కురవ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు గౌనిపల్లి శివ, కలకడ ఎక్స్ ఎంపీపీ కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

28న గాన గంధర్వుడికి ఘన నివాళి

రాజంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం ఉదయం భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 5వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్.కళాంజలి తెలిపారు. ఈ సందర్భంగా లలిత సంగీత, జానపద పాటలు, తెలుగు సినిమా పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను పాల్గొనదలచినవారు ఒక్కో విభాగానికి రూ.100 చొప్పున చెల్లించాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ 2 వేలు, తృతీయ వెయ్యి రూపాయల చొప్పున ప్రదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కన్సొలేషన్ బహుమతిగా ఇద్దరికి రూ.500తో పాటు శాశ్వత షీల్డు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9490884300, 9490443000 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రతి విద్యార్థి హిందీ భాష నేర్చుకోవాలి

నందలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి హిందీ భాష నేర్చుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు మహమ్మద్‌షఫీ ఉల్లా సూచించారు. మంగళవారం స్థానిక శ్రీ అన్నమాచార్య అకాడమి హైస్కూల్లో కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర స్థాయిలో కొన్ని ఉద్యోగాలకు హిందీ భాషా పండితులకు ప్రత్యేకంగా కోటా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు




పట్టుబడిన గంజాయి విక్రేతలతో ఎక్సైజ్ అధికారులు సిబ్బంది

రాయచోటి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత రాయచోటి సమీపంలో మంగళవారం రాత్రి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక కేజీ గంజాయితోపాటు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురు ప్రసాద్ తెలిపారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్ జహీర్ అహ్మద్, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి మాండవ్య నది బ్రిడ్జిపై గంజాయి విక్రయిస్తున్న షేక్ ఖాసి, షేక్ మాబూఖాన్‌ను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సతీశ్, లక్ష్మి నరసయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా ఒయ్యారం.. పొలం సింగారం





ఇటీవల కురిసిన వర్షాలకు బీడు భూములు.. కొండలు పచ్చదనం సంతరించుకున్నాయి. ఎగువ నుంచి వరద రావడంతో పెన్నా పరవళ్లు తొక్కుతోంది. పెన్నా పరీవాహక ప్రాంతమంతా వరిపైరుతో పచ్చగా కళకళలాడుతోంది. సిద్దవటం మండలం లింగంపల్లి, బండికనుమ ప్రాంతాలు సంధ్యవేళ ప్రకృతిప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఒంపుసొంపులతో ఒయ్యారంగా ప్రవహిస్తున్న పెన్నానది.. కనుచూపుమేరా పచ్చదనం సింగారించుకున్న పుడమితల్లి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించేందుకు పలువురు ఇక్కడకు వస్తున్నారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఆదర్శరైతుకు జీవిత సాఫల్య పురస్కారం



ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ వ్యవసాయ శాస్త్ర, సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఆసియా పీజీపీఆర్ (మొక్కల పెరుగుదలను ప్రోత్స హించే రైజో బ్యాక్టీరియా) జాతీయ సదస్సులో కోడూరు ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు, యూఎస్ఏ, యూకే, హంగేరి వంటి దేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. మొక్కల పెరుగుదలను ప్రోత్సహించే రైజో బ్యాక్టీరియా అంశంపై జరిగే ఈ సదస్సు కొత్త ఆవిష్కరణలు, పరిశోధన ఫలితాలు, భవిష్యత్తు అవకాశాలపై చర్చించడానికి ఒక వేదికగా నిలిచింది. ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు వ్యవసాయ రంగంలో, ముఖ్యంగా పీజీపీఆర్ పరిశోధన, అభివృద్ధిలో చేసిన అసాధారణ కృషి, రైతులకు అందించిన మార్గదర్శకత్వం, కొత్త సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడంతో ఆయన పోషించిన ప్రముఖ పాత్ర గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. కోడూరు ప్రాంతానికి అరుదైన గౌరవం తీసుకొచ్చిన ఆదర్శ రైతు రామరాజుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి

- అడిషనల్ ఎస్పీకి సీపీఐ నేత మొర



సెల్వన్‌కుమార్ భార్యను విచారిస్తున్న ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే

పుల్లంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారుల నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ మండల పరిధిలోని దళవాయిపల్లె హరిజనవాడకు చెందిన మండల సీపీఐ కార్యదర్శి సెల్వన్ కుమార్ భార్య ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు రోజుల క్రితం ఆ కుటుంబంపై దాడి చేసినట్లు నమోదైన కేసుపై మంగళవారం రాజంపేట అడిషనల్ ఎస్పీ రామ్‌నాధ్‌హెగ్డే దళవాయిపల్లె హరిజన వాడలో విచారణ చేశారు. ఈ సందర్భంగా దాడికి కారణాలను, ఎంతమంది పాల్గొన్నారు. ఏ సమయంలో జరిగింది అనే విషయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సెల్వన్ కుమార్ భార్య మాట్లాడుతూ తమకు ప్రాణ భయం ఉందని కాపాడాలని మొరపెట్టుకున్నారు. మీరు భయపడవద్దని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా చూస్తామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. దాడిలో దెబ్బతిన్న బైకు, ఆటో, కారును కూడా ఆయన పరిశీలించారు. అనంతరం బాధితులను పుల్లంపేట స్టేషన్‌కు పిలిపించి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సీఐ బీవీ రమణ, ఎస్ఐ శివకుమార్‌లు పాల్గొన్నారు.

టమోటాలను గిట్టుబాటు ధరకు కొనండి

- మార్కెట్ కమిటీ కార్యదర్శి సూచన



సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టమోటాలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. టమోటా ధరలు తగ్గిపోవడంతో మార్కెటింగ్ శాఖ కమిషనర్ సునీత ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో టమోటా కొనుగోలు చేసే బయటి రాష్ట్రాల వ్యాపారులతో మాట్లాడుతూ రైతులు నాణ్యమైన టమోటాలు మార్కెట్‌కు తీసుకొస్తున్నారని, మంచి ధరలకు టమోటాలు కొనుగోలు చేయాలన్నారు. అక్టోబరు మొదటి వారంలో టమోటా ధరలు పెరిగే అవకాశం ఉందని కార్యదర్శికి తెలియజేశారు. సమావేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కర్నాటక గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మిశ్రా, విక్రమ్, జగదీష్, గోవిందు, శంకర్, సనావుల్లా, రఫిక్, రాజుభాయ్, మింటు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3,93,869

నందలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,93,869 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. 30 రోజుల అనంతరం హుండీని లెక్కించామని, వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

షరతులు లేని వాహనమిత్ర అమలు చేయాలి

- ఏఐటీయూసీ నేతల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా ఆటో నడిపే ప్రతి డ్రైవర్‌కు వాహనమిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ముబారక్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వాహనమిత్ర రూ.15 వేలు ఇస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహనమిత్ర పథకం అన్నారు. ఇప్పుడేమో ఓనర్ కమ్ డ్రైవర్‌కు అంటున్నారు. రాష్ట్రమంతా పెద్ద ఎత్తున జరుగుతున్న ఆటో డ్రైవర్ల ఉద్యమాన్ని చల్లార్చడం కోసం వాహనమిత్ర పథకం అమలు తేదీ ప్రకటించారన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు 50 శాతం సబ్సిడీతో విద్య, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు, చంద్రన్న బీమా ద్వారా సహజ మరణం చెందిన డ్రైవర్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అపరాధ రుసుం పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేస్తామని చెప్పిన పాలకులు ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని, 60 ఏళ్ల వయసు పైబడిన ఆటో డ్రైవర్‌కు సంక్షేమ బోర్డు నుంచి నెలకు రూ.8 వేలు పింఛన్ ఇవ్వాలని, మదనపల్లె, రాజంపేట, పీలేరు ఆర్డీవో కార్యాలయాల్లోనే ఎఫ్‌సీ సేవలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫైనాన్సియర్ల ఆగడాలు అరికట్టి, ప్రభుత్వమే వాహనాలకు ఐదు శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, నరసింహులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గంగులప్ప, కరీముల్లా, వస్తాన్, రమణ, శివయ్య, నాగరాజు, చంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నీటిసంపులో పడి విద్యార్థి మృతి

- మిన్నంటిన కుటుంబీకుల రోదనలు





రోదిస్తున్న కుటుంబసభ్యులు, (ఇన్‌సెట్లో) నీటిసంపులో పడి మృతిచెందిన కళ్యాణ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీటిసంపులో పడి ఓ బాలుడు తుదిశ్వాస విడిచిన దుర్ఘటన మంగళవారం బి.కొత్తకోట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని పీటీఎం రోడ్డులోని ఆస్పత్రి సమీపంలో నివాసం వుంటూ తోపుడుబండిలో పళ్లవ్యాపారం చేసుకుంటున్న ఈశ్వరప్ప కుమారుడు కళ్యాణ్(8) సమీ పంలో వున్న ప్రభుత్వపాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకుంటా నని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. స్నేహితు లతో ఆడుకుంటూ రోడ్డుపక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోని నీటిసంపులో పడి పోయాడు. తమతో పాటు ఆడుకుంటున్న కళ్యాణ్ కనిపించక పోవడంతో పిల్లలు వెళ్లి బాలుడి తల్లితండ్రులకు తెలిపారు. దీంతో కుటుంబీకులు ఆచూకీ కోసం వెతకగా నీటిసంపులో పడివుండడాన్ని గమనించారు. హుటాహుటిన బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. దీంతో తల్లితో పాటు కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. బంధుమిత్రుల ఆర్త నాదాలతో ఆస్పత్రి ఆవరణం హోరెత్తింది. ఆకస్మాత్తుగా జరిగిన ఘటనలో బిడ్డను కోల్పో యిన తల్లిదండ్రులను ఓదార్చడం కష్టసాధ్య మైంది. ఘటనపై బి.కొత్తకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్టేషన్‌లోనే మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యశోద

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘంలో తీసుకున్న అప్పు డబ్బులు భర్త చెల్లించలేదని తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ మంగళవారం సాయంత్రం మదనపల్లె తాలూకా పోలీసు స్టేసన్‌కు వచ్చింది. అక్కడ పోలీసులు అప్పు మొత్తం తననే కట్టాలని చెప్పారంటూ ఆవేదనకు గురైన ఆమె వెంట తెచ్చుకున్న పురుగుల మందును పోలీస్టేషన్ వద్ద తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే బంధువులు ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు.. నల్లగుట్లపల్లెకు చెందిన మల్లికార్జున భార్య యశోద లక్ష్మీవేంకటేశ్వర మహిళా గ్రూప్ లీడర్‌గా ఉంది. భర్తకు వైద్యం నిమిత్తం, ఇల్లు కట్టుకోవడానికి తమ గ్రూప్‌లో రూ.4 లక్షలు రుణం తీసుకుంది. అనంతరం భార్య భర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ద్వారా వారు విడిపోయారు. డ్వాక్రా రుణాన్ని భర్తే చెల్లించాలని ఆ సమయంలో చెప్పారు. ఇంటర్ చదువుతున్న కుమారుడు గణేష్, 13 ఏళ్లున్న కుమార్తె లిఖిత తండ్రి వద్దే ఉన్నారు. భర్త డ్వాక్రా రుణం చెల్లించకపోవడంతో గ్రూప్ సభ్యులు ఆమెను నిలదీశారు. దీంతో ఆమె భర్తపై ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వచ్చింది. అక్కడ సీఐ కళా వెంకటరమణ ఇది సివిల్ కేసు మీరు కోర్టులో తేల్చుకోమని సలహా ఇచ్చారు. కాగా.. ఇంట్లో ఉన్న బంగారు, డబ్బు ఆమె తీసుకెళ్లిందనేది భర్త ఆరోపణ. ప్రస్తుతం ఇల్లు తన పేరిట రాసి ఇవ్వాలనే దురుద్దేశంతో తనను బెదిరించడానికి ఇలా చేసిందని భర్త పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు...



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామం, దిగువ నంబూవారిపల్లె వాసి గోపి కుమారుడు అనిల్ డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చెంబకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి ప్రథమచికిత్స కోసం తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపు కేసు నమోదు

ముద్దనూరు సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోడిగాండ్లపల్లె గ్రామానికి చెందిన కర్నాటి వరలక్ష్మిని ఆమె భర్త రమణారెడ్డి వేధింపులకు గురిచేస్తుండడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. అదనపు కట్నం కోసం రమణారెడ్డి, బంధువైన నాగలక్ష్మీ వేధిస్తున్నారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని విద్యార్థి సుక్షిత్ (22) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, ఆరోగ్యవరం వాసులు సందీప్, తల్లి రుక్మిణీ కుమారుడు సుక్షిత్. కాగా 15 ఏళ్ల కిందట తండ్రి మరణించడం, తల్లి ఇల్లు వదిలి వెళ్లిపోవడంతో తన అవ్వ సుగుణమ్మ వద్దే ఉంటూ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజు కళాశాలల్లో అందరితో బాగా కలివిడిగా ఉండేవాడని మిత్రులు చెబుతున్నారు. అయితే ఏమైందో ఏమో మంగళవారం తెల్లవారుజామున ఆరోగ్యవరంలో తన అవ్వ ఇంట్లో బాత్ రూమ్‌లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం మదనపల్లె తాలుకా పోలీసులకు తెలియడంతో వారు సంఘటన స్థలం పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి మృతి అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడు ..



వృద్ధుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సోమవారం పోలీసులకు సమచారం అందించారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, సమాచారం కోసం వెదికారు. ఏమి లభించకపోవడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తమ బంధువుల కోసంగుర్తు తెలియని మృతదేహం వేచిఉంది. ఇతని వయస్సు సుమారుగా 80 ఏళ్లు ఉంటాయని, పెరిగి మాసిన గడ్డంతో, లుంగీ, షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..



జయమ్మ (ఫైల్ ఫొటో)

కలకడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరాయ చెరువు-మర్రిపాడు మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు జయమ్మ (60) మృతి చెందినట్లు ఎస్ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కదిరాయచెరువు వాసి జయమ్మ పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొందన్నారు. తీవ్ర గాయలపాలైన బాధితురాలిని 108లో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు.

పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



పిడుగుపాటుకు ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కురబలకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లులో పిడుగుపాటుకు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి జరిగిన సంఘటన వివరాల్లోకెళితే... రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయితే అర్ధరాత్రి కడపరోడ్డులో రోడ్డు పక్కన పిడుగు పడింది. దీంతో బ్రాహ్మణొడ్డుపల్లె, భారత్ కళ్యాణ మండపం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ధ్వంసమవడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాగా ట్రాన్స్‌కో సిబ్బంది వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి మర మ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెలో వర్షానికి విద్యుత్ స్తంభం నేల కూలింది.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

కురబలకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కురబలకోట జడ్పీహైస్కూల్ విద్యార్థిని షహనాజ్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. కురబలకోట వాసి రఫి కుమార్తె షహనాజ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మదనపల్లెలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైంది. కాగా విద్యార్థిని సత్య సాయి జిల్లా హిందూపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థిని ఎంఈఓ ద్వారకనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

బండ బరువులు మోస్తున్నా...

● శ్రమకు తగ్గ ఫలితం లేదు ● హమాలీల ఆవేదన



కమలాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీలు బండ బరువులు మోస్తున్నా వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడంలేదు. రేషన్ షాపులకు సంబంధించి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను దింపడం, ఎత్తడం వీళ్ల చేస్తుంటారు. గోడౌన్లలో అన్‌లోడింగ్ చేయడం, వాటిని తిరిగి వాహనాల్లోకి లోడు చేసి సంబంధిత చౌక ధాన్యపు డిపోల్లో దింపే పనులను వీరు చేస్తున్నారు. ఒళ్లు గుల్ల చేసుకుంటూ బరువులు మోస్తున్నా తమ కష్టానికి తగిన ప్రతిఫలం లేదంటూ హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమలాపురం హెడ్‌క్వార్టరులో స్టాకు పాయింట్లు ఉన్నాయి. ఇందులో 10 మంది హమాలీలు దాదాపు 10 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. గతంలో చౌక ధాన్యం దుకాణాల వద్ద నిత్యావసర వస్తువులను ఆన్‌లోడింగ్ చేసే సందర్భంలో డీలర్లు నేరుగా హమాలీలకు ఆన్‌లోడింగ్ చార్జీలు ఇచ్చేవారు. వీరికి క్వింటాల్‌కు లోడింగ్ అన్‌లోడింగ్‌కు కలిపి రూ.24లు ఇస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో థర్డ్‌పార్టీ ద్వారా బిల్లులను కార్మికుల ఖాతాల్లో వేసే పద్ధతి తెచ్చారు. కొన్ని నెలల తరువాత ఆ పద్ధతి ఆపి ఎవరైతే లారీ కాంట్రాక్టరు ఉంటారో వారి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు. ఈ విధానంలో కార్మికులకు నెలనెలా సక్రమంగా బిల్లులు అందడం లేదని వాపోతున్నారు. గతంలో లాగా ఎఫ్ఎస్ఈ షాపుల వద్ద అన్‌లోడింగ్ సమయంలో నేరుగా డీలర్లే అన్‌లోడింగ్ చార్జీలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హమాలీలు కోరుతున్నారు. ఆన్‌లైన్ రూట్‌మ్యాపింగ్ అని చెప్పి షాపులు మార్చడం వల్ల షాపులు తగ్గి హమాలీలకు వేతనాలు తగ్గాయంటున్నారు. ఇలా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం బస్తాలను లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సి రావడంతో హమాలీలకు ఇబ్బంది మారింది. గతంలో డీలర్ల వద్దనే మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బియ్యాన్ని దింపేవారు. పాఠశాలలు ఇరుకు ప్రాంతంలో ఉండడంతో దారిలేక లారీలు చాలాదూరంగా నిలుపుతున్నారు. ఇప్పటి వరకు వీళ్లకు కూలీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



కష్టపడి పనిచేస్తున్న హమాలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. వీరిని ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ప్రతినెలా 5వ తేదీ వేతనాలు చెల్లించాలి. సరుకు లోడింగ్, ఆన్‌లోడింగ్ విషయంలో హమాలీలపై పని వత్తిడి తగ్గించాలి. 12 రోజుల పని విధానాన్ని అమలు చేయాల్సి ఉంది. మృతి చెందిన హమాలీల కుటుంబాలకు రావాలసిన నష్టపరిహారం, బిల్లులు వెంటనే ఇవ్వాలి. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసి ఆదుకోవాలి.

- జి.నాగేశ్వర్‌రావు, ఏపీ సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకుడు

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భవ్య గుజరాత్‌యాత్ర

● సోమనాథ్, సబర్మతి వంటి పుణ్యక్షేత్రాలు,చారిత్రక ప్రాంతాలు దర్శనం
● తొమ్మిది రాత్రులు, పదిరోజుల ప్రయాణం
● ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్



బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ అధికారులు, ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేశాఖలో భాగమైన ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భవ్య గుజరాత్ యాత్ర స్పెషల్ రైలును ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ తిరుపతి ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. సోమనాథ్ జ్యోతిర్లింగాలు, సబర్మతి ఆశ్రమం వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రాత్మక ప్రాంతాలను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. భవ్య గుజరాత్ యాత్ర తొమ్మిది రాత్రులు, పది రోజులు కొనసాగుతుందన్నారు. మంగళవారం కడప రైల్వేస్టేషన్ వీఐజీ లాంజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబరు 7 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర స్పెషల్ రైలులో 639 మంది యాత్రికులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, రాణికివావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను దర్శించే అవకాశం ఉంటుందని వివరించారు. అక్టోబరు 7 నుంచి 16 తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. రేణిగుంట నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి రేణిగుంటకు చేరుకుంటుంది.

భోజన వసతి టికెట్ ధర వివరాలు

యాత్రికులకు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, వెజిటేరియన్ భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రతి యాత్రికుడికి ప్రయాణ బీమా కల్పిస్తామని చెప్పారు. టికెట్ ధరలు స్లీపర్ క్లాస్‌కు రూ.18,400, 3వ ఏసీకి రూ.30,200, 2వ ఏసీకి రూ.39,900గా నిర్ణయించారన్నారు. కాగా, టికెట్ బుకింగ్ కోసం బి.యేసయ్య 9281495853, కె.పవన్‌కుమార్ 8287932313 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కడప రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, కమర్షియల్ అధికారి మోహన్‌దాస్, స్టేషన్ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్ రద్దు

● ఉత్తర్వులు జారీచేసిన ఆర్డీవో సాయిశ్రీ ● సంతోషం వ్యక్తం చేసిన బాధితులు



గిఫ్ట్‌డీడ్ రద్దు చేసిన ఉత్తర్వులను సీనియర్ సిటిజన్లకు అందజేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఒకే రోజు ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసి బాధితులకు న్యాయం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో తన కార్యాలయంలో సంబంధిత వృద్ధులకు వేర్వేరుగా ఉత్తర్వులను అందజేశారు. ఇందుకు సంబంధించి ఆర్డీవో తెలిపిన వివరాల మేరకు... జమ్మలమడుగు ఆర్డీవో పరిధిలో నివశిస్తున్న ముగ్గురు వయోవృద్ధులు తమకు అవసరమైన సంరక్షణ, ఆహారం, వైద్యం, సహాయం అందిస్తారని ఉద్దేశ్యంతో వారి జీవిత కాలంలో సంపాదించి కూడబెట్టిన ఆస్తిని గిఫ్ట్‌డీడ్ కింద రాసిచ్చారు. అయితే తమ పిల్లలు తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆస్తులు తీసుకుని వదిలించుకోవాలని చూస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ బాధితులు నాలుగునెలల క్రితం ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో వృద్ధుల బాగోగులను సక్రమంగా చూడని వారి సంబంధీకులకు మెయింటినెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్టు 207 సెక్షన్ 23 ప్రకారం చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేయడంతో పాటు మూడు నెలలుగా వారివారి నివాస ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన శ్రీయపురెడ్డి క్రిష్టారెడ్డి (72) శ్రీయపురెడ్డి సరస్వతమ్మ దంపతులు తమకు అవసరమైన సంరక్షణ, ఆహారం, వైద్యం, సహాయం అందిస్తారని ఉద్దేశ్యంతో తమ కుమార్తె తిరుపతి సిద్ధకుమారి అల్లుడు వీరారెడ్డిలకు 2005 జూన్ 2న గిఫ్ట్ సెటిల్‌మెంట్ కింద 1.85 ఎకరాల భూమిని రాయించారు. అయితే వారికి అవసరమైన సంరక్షణ అందించలేదని, వైద్య ఖర్చుల కోసం బాధి తులు తమ నివాస గృహాన్ని విక్రయించాల్సి వచ్చిందని తమ విచారణలో తేలినట్లు ఆర్డీవో తెలిపారు. అలాగే జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్‌సీ బాలమ్మ (72) సైతం తన బాగోగులు చూస్తారన్న ఉద్దేశ్యంతో తన మూడవ కుమారుడు ఎస్‌సీ విశ్వనాథరెడ్డి, కోడలు పార్వతీకి 2022 సెప్టెంబర్ 9న 3.18 ఎకరాల వ్యవసాయ భూమిని రిజిస్టర్ చేయించారు. అయితే వృద్ధురాలికి వారి నుంచి సంరక్షణ లేదని విచారణలో వెల్లడైందన్నారు. అలాగే దువ్వూరు మండలానికి చెందిన జి.మహమ్మద్‌గౌస్ (74) సంతానం లేని కారణంగా తమ జీవితం చివరి దశలో తన సంరక్షణ ఎలా ఉంటుందోనని.. తన ఆస్తిని (ఇంటిని) సోదరుడి మనుమడు మహమ్మద్ తాహీర్, అతని తల్లి గౌసియాకు 2022 డిసెంబర్ 13న గార్డియన్‌షిప్‌లో బహుమతిగా ఇచ్చారు. అయితే వీరి నుంచి బాధితులకు సంరక్షణ లేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు పై ముగ్గురు వృద్ధులకు సంబంధించిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశామని ఆర్డీవో తెలిపారు. దీంతో బాధితులు తమకు న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ గిఫ్ట్‌డీడ్ అనేది వృద్ధులు తమ జీవితాంత సంరక్షణ కోసం ఇచ్చినప్పటికీ.. ఎవరైనా ఆస్తులు తీసుకుని ఇలాంటి ఇబ్బందులు కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను గౌరవించి వారి బాగోగులు చూసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, ఏవో ఇక్బాల్, బాష, రజియా తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహిళ మృతి

● ఇరువురు యువకులకు గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగర పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళ మృతి చెందగా.. ఇరువురు యువకులు గాయపడ్డారు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు... ఖాజీపేట మండలానికి చెందిన ఆదిలక్ష్మమ్మ (60) సొంత పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి బైకులో ఖాజీపేట వెళుతుండగా రెండో గాంధీ బొమ్మ వద్దకు రాగానే ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోసుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. అలాగే కడప మాసాపేటకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బిల్టప్ సర్కిల్ వద్ద మైదుకూరు నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్లు సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అలాగే నాగరామ్ గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'గంగ' కాల్వలో యువకుడి మృతి



కలసపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లారెడ్డిపల్లె దారిలో అంకాళమ్మ గుడి వద్ద ఉన్న తెలుగు గంగ కాల్వలో మంగళవారం స్నానానికి వెళ్లి ఆరవేటి సుబ్రహ్మణ్యం (30) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళితే... ప్రకాశం జిల్లా కంభం మండలం చిన్నకంభం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గత కొద్దిరోజుల నుంచి కలసపాడుకు చెందిన ఓ మేస్త్రీ వద్దకు కూలీ పనులకు వెళ్తున్నాడు. మంగళవారం పనులు లేకపోవడంతో తెలుగుగంగ కాల్వలో తన బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి.. తర్వాత స్నానానికి దిగాడు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు



జమ్మలమడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులో ఎస్ఆర్ పెట్రోలు బంకు సర్కిల్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం బండ్ల మూరి డానియేల్ అనే వ్యక్తి చెట్టుకింద నిద్రపోతుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన డానియేల్ ప్రొద్దుటూరుకు వెళుతుండగా నిద్ర వస్తుండటంతో స్కూటర్ పక్కనే పెట్టి బండపై నిద్రపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తల, చేతులపై దారుణంగా కొట్టి సెల్, స్కూటర్ లాక్కుని వెళ్లిపోయారు. స్థానికులు అతన్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శివాలయంలో చోరీ



సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న దొంగ

చక్రాయపేట,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభిరెడ్డివారిపల్లె సమీపాన వెలసిన శివాలయంలో మంగళవారం మధ్యాహ్నం శివాలయంలో చోరీ జరిగినట్లు అర్చకులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలకు వెళితే.... ఆలయ పూజారులు ఉదయం పూజలు ముగిసిన తర్వాత గర్భాలయానికి తలుపులు వేసి వెళ్లారు. ఆ సమయంలో దొంగ కటాంజనాన్ని రాడ్‌తో నెట్టి ఆలయంలోకి ప్రవేశించాడు. ప్రాంగణంలో ఉన్న హుండీలోని దాదాపు రూ.50వేల వరకు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సీసీ ఫుటేజీలో దొంగ స్పష్టంగా కనిపిస్తున్నాడు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

దువ్వూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు, మీర్జఖాన్‌పల్లె పరిధిలో అయిదు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు మంగళవారం విద్యుత్తు శాఖ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. బుచ్చిరంగడు, పట్టాభిరామయ్య, బుచ్చెయ్య, రాంప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి అనే రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని చెప్పారు. ఈమేరకు స్థానిక ఎస్ఐ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

ఖాజీపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంజనేయపురంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఘర్షణలు లేని గ్రామాలు ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఏదైనా ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి రాకుంటే న్యాయసేనాధికారి సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు సివిల్‌జడ్జి ఖాజామొహిద్దీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఇర్విన్, డీఎస్పీ రాజేంద్రప్రసాద్, తహసీల్దారు ఏవీ రవణమ్మ, సీఐ వంశీధర్, సర్పంచ్ చంద్రశేఖర్, న్యాయవాదులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు మస్కా

● రూ.10లక్షలతో రీసోర్స్ పర్సన్ పరార్
● పోలీసులను ఆశ్రయించిన సంఘం సభ్యులు



పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన డ్వాక్రా సంఘం మహిళలు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల్లో కూడా మోసాలు, అవినీతికి పాల్పడుతున్నారు. బద్వేలు మెప్మాలో అనేక అవకతవకలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సంఘాల్లో ఉండే సభ్యులకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో మెప్మాలోని రీసోర్స్ పర్సన్‌ల ద్వారా సంఘాలను నడిపిస్తుంటారు. బ్యాంకుల్లో లోన్లు తీసుకోవాలన్నా, కట్టాలన్నా ఆర్పీలే కీలకం. అయితే బద్వేలు మున్సిపాలిటీ పరిధి లోని గౌరిశంకరనగర్‌లో నివాసం ఉండే మహిళలు 10మంది కలిసి సరస్వతి గ్రూపు, శంకర్‌గ్రూపు అనే పేరుతో పొదులో ఉన్నారు. అయితే ఆ గ్రూపు ఆర్పీ ఆ మహిళలను బురిడీ కొట్టించి రూ.10లక్షలతో ఉడాయించింది. గ్రూపు సభ్యులు అడిగితే మాటదాటేస్తూ తనకు రాజకీయ అండదండలు ఉన్నాయంటూ బెదిరిస్తూ ఉన్నట్లుండి ఒక్కసారిగా డబ్బుతో ఉడాయించింది. బయటకు మాత్రం రూ.10లక్షలు కనపడుతున్నా.. ఎన్ని లక్షల రూపాయలు స్వాహా చేసిందో తెలియదని.. అధికా రులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజాలు తెలుస్తాయని గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మెప్మా అధికారులకు ఈ వ్యవహారం తెలిసినప్పటికీ కప్పిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పొదుపు సంఘాల మహిళలు బద్వేలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయ గా, కేసు నమోదు చేయకపోవడంపై ఆంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి నిజానిజాలు తేల్చాలని కోరుతున్నారు.

ఆంధ్ర యువసంకల్ప డిజిటల్ మారథాన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర యువ సంకల్ప 2025 డిజిటల్ మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈవో ఐజె విజయకుమార్ తెలిపారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా యువతకు సృజనాత్మకత ఆవిష్కరణ, బాధ్యతలు వేదికగా వీడియోలను డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఆంధ్ర.యువసంకల్ప.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యత, ఫిట్‌నెస్ మరియు క్రీడలు, డిజిటల్ ఇన్నోవేషన్ అంశాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తిగల 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న యువత పై తెలిపిన వెబ్‌సైట్‌లో ఈనెల 30లోపు నమోదు చేసుకుని సంబంధిత వీడియోను అప్‌లోడ్ చేయాలన్నారు.

వైవీయూలో ముగిసిన ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థుల బోధన నైపుణ్యత, అర్హతలను పరిశీలించారు. ఇంటర్వ్యూలలో సబ్జెక్టు నిపుణులు అనంతపురం ఎస్కెయూ నివర్సిటీ ప్రొఫెసర్ ఎంవీ శ్రీనివాసన్, వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డీన్‌లు ప్రొఫెసర్ పి.రమాదేవి, ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ అధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎదురీదుతున్న కర్నూలు, కడప జట్లు



నికిత్‌గౌడ్, మహేంద్రరెడ్డి, వికాస్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం కర్నూలు, కడప జట్లు ప్రత్యర్థి జట్ల కన్నా వెనకంజలో ఎదురీదుతున్నాయి. వివరాలిలా..

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 103.3 ఓవర్లలో 454 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో నికిత్ గౌడ్ 153 పరుగులు, బాలాజీ 59 పరుగులు చేశా రు. కాగా, కర్నూలు జట్టు బౌలర్ ఖనిష్ ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన కర్నూలు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 236 పరుగుల లోటుతో ఎదురీదుతుంది.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 150.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 537 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మహేంద్రరెడ్డి 239 పరుగులు, వికాస్ 109 పరుగులు చేశారు. అనంతరం భారీ స్కోరు లక్ష్యాన్ని అందుకునే క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. ఇందులో విజయ్‌రామిరెడ్డి 59 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో కడప జట్టు మరో 428 పరుగుల వెనుకంజలో ఉంది.

పోటీ ప్రపంచంలో సత్తాచాటండి

పోటాపోటీగా కోటపల్లె, ఎంజేపీ పీలేరు ● ముగిసిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు : ఎంఈఓ పద్మావతి




ఖోఖో పోటీల్లో విన్నర్స్ ఎంజేపీ విద్యార్థులు - పీటీఎం జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పీలేరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆల్‌రౌండ్ ప్రతిభ చాటాలని ఎంఈఓ పద్మావతి విద్యార్థులకు సూచించారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో కోటపల్లె జడ్పీహైస్కూల్, ఎంజేపీ పీలేరు పాఠశాలల విద్యార్థులు పోటాపోటీగా సత్తాచాటారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక దృఢత్వం, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు తప్పని సరని, నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆల్‌రౌండర్‌గా నిలవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

అండర్ 14 కబడ్డీ బాలికల విభాగంలో విన్నర్స్‌గా ఎంజేపీ పీలేరు, రన్నర్స్‌గా జడ్పీహెచ్ఎస్ శివరామపురం, బాలుర విభాగం విజేతగా జడ్పీహైస్కూల్ కోటపల్లె విద్యార్థులు నిలిచారు. బాలికల విభాగం ఖోఖోలో విన్నర్స్‌గా ఎంజేపీ పీలేరు, రన్నర్స్‌గా ఏపీఆర్‌డబ్ల్యూఎస్ బాలికల గురుకులం నిలిచారు. బాలుర విభాగంలో జడ్పీహైస్కూల్ కోటపల్లె విన్నర్స్ కాగా జడ్పీహైస్కూల్ రేగళ్లు రన్నర్స్‌గా నిలిచారు. బాలికల చెస్ పోటీల్లో విన్నర్స్‌గా ఎంజేపీ పీలేరు, రన్నర్స్‌గా జడ్పీహైస్కూల్ కోటపల్లె విద్యార్థులు గెలుపొందారు. బాలుర విభాగంలో విన్నర్స్‌గా వీఎస్ఎన్ సిద్దార్థ, రన్నర్స్‌గా జడ్పీహైస్కూల్ కోటపల్లె విద్యార్థులు, అండర్ 17 బాలికల విభాగం వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా ఎంజేపీ పీలేరు, రన్నర్స్‌గా ఏపీడబ్ల్యూఆర్ఎస్ పీలేరు నిలిచారు. బాలుర విభాగంలో విన్నర్స్‌గా జడ్పీహైస్కూల్ కోటపల్లె విద్యార్థులు నిలిచారు. ఖోఖో బాలికల విభాగం విన్నర్స్‌గా ఎంజేపీ పీలేరు, రన్నర్స్‌గా ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ పీలేరు, బాలుర విభాగంలో కోటపల్లె జడ్పీహైస్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు. బాలికల చెస్ విభాగంలో విన్నర్స్‌గా జడ్పీహైస్కూల్ పీలేరు, రన్నర్స్‌గా ఎంజేపీ పీలేరు, బాలుర విభాగంలో విన్నర్స్‌గా వీఎస్ఎన్ సిద్దార్థ, రన్నర్స్‌గా జడ్పీ హైస్కూల్ కోటపల్లె విద్యార్థులు నిలిచారు. మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివకుమార్, పీడీలు రేణుక, నారాయణరెడ్డి, నరేంద్రబాబు, నాగరాజ, సురేంద్ర, రమణమ్మ, మూర్తి, బేబమ్మ, ఉజ్వల, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడాపోటీల్లో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి విజేతల వివరాల్లోకెళితే... ఖోఖో అండర్ 17 బాలుర విభాగంలో రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్ 14 విభాగంలో విన్నర్స్‌గా ఇదే పాఠశాలకు చెందిన బాలికలు నిలిచారు. అండర్ 17 బాలుర విభాగం కబడ్డీలో పీటీఎం మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో పీటీఎం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ పోటీల్లో కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో పీటీఎం పాఠశాల విద్యార్థులు నిలిచారు. కబాడ్డీ బాలుర విభాగంలో విన్నర్స్‌గా పీటీఎం మోడల్ స్కూల్ కాగా రన్నర్స్‌గా పీటీఎం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. వివిధ పోటీల్లో విజేతలను మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే డివిజనల్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 గౌస్‌పీర్ ప్రధానోపాధ్యాయులు వేమనారితో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు

గుర్రంకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఉర్దూ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. అండర్-14,-17 విభాగాల్లో 100 మీటర్లు, 200 మీటర్ల, లాంగ్ జంప్, హై జంప్ పోటీలను నిర్వహించారు. 100 మీటర్ల పరుగు పందెంలో అండర్-14 బాలుర విభాగంలో విష్ణు వర్దన్, బాలికల విభాగంలో సంధ్య, అండర్-17 బాలుర విభాగంలో మహమ్మద్ అలీ, బాలికల విభాగంలో చందన విజేతలుగా నిలిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో అండర్-14 బాలుర విభాగంలో రెడ్డి, బాలికల విభాగంలో గాయిత్రి, అండర్-17 బాలుర విభాగంలో నిఖిల్, బాలికల విభాగంలో గాయత్రి విజేతలుగా నిలిచారు. విజేతలు డివిజన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. ఎంఈఓ సుబ్రమణ్యం, పీఈటీలు ఆనంద్, రెడ్డిశ్రావణి, జోత్స్న పాల్గొన్నారు.

సత్తా చాటిన కలికిరి బాలికలు

కలికిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పోటీల్లో కలికిరి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో పోటీల్లో సీనియర్ విభాగంలో వరుసగా మూడింటిలోనూ జి.మహాలక్ష్మి విన్నర్‌గా నిలిచింది. జూనియర్ విభాగంలో ఇదే పాఠశాలకు చెందిన డి.నిహారిక షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో విన్నర్‌గా నిలిచింది. షాట్‌పుట్‌లో కలికిరి గురుకుల పాఠశాల విద్యార్థిని వి.సింధు డివిజన్ పోటీలకు అర్హత సాధించింది. ఇక అన్ని పోటీల్లోనూ కలికిరి జడ్పీ బాలికోన్నత పాఠశాల వరుస విజయాలు సాధించింది. బాలుర సీనియర్ విభాగంలో వరుసగా వంద, 200, 400 మీటర్ల పరుగు పందెంలో కలికిరి చదివేవాండ్లపల్లె పాఠశాల విద్యార్థులు డి.మహేష్, జె.మహేష్ విన్నర్స్‌గా నిలవగా మరో విద్యార్థి కె.గణేష్ 800 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచాడు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో కూడా మహేష్ సత్తాచాటి విజేతగా నిలిచాడు. బాలుర జూనియర్ విభాగంలో మహల్ తెలుగు హైస్కూల్ విద్యార్థి ఎస్.మహ్మద్ ఉమర్ వరుసగా 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ పోటీలను గడి ఉర్దూ హైస్కూల్ హెచ్ఎం ఎ.శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు. మండల పోటీల కోఆర్డినేటర్ రియాజ్ అహ్మద్, వివిధ పాఠశాలల పీడీలు నాగరాజ, రెడ్డిమోహన్ రెడ్డి, చిన్నప్ప, గులాబ్ జాన్, గీత, రూప్సీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటో డ్రైవర్ల దరఖాస్తులు స్వీకరణ

కలికిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్యాసింజర్ ఆటో, మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు/డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అర్హులు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ భానుమూర్తి రావు కోరారు. గతంలో వాహన మిత్ర పథకం కింద లబ్ధిపొందిన వారి వివరాలన్నీ సచివాలయాల్లో అందుబాటులో వున్నా వారు కూడా దరఖాస్తు చేయాలన్నారు. కొత్తగా వాహనం సమకూర్చుకున్న డ్రైవర్లు కూడా బుధవారం నుంచి సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. వీరికి శుక్రవారం వరకు గడువున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

ఆటోలు నడుపుతున్న డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి వుండాలని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక పోలీసు స్టేషను వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు నియమాల గురించి వివరించారు. కొత్త ఎస్పీ ధీరజ్ కునుబిలి ఆటో డ్రైవర్లందరికీ అవగాహన కల్పించాల్సిందిగా ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ జీతాలు తక్షణం చెల్లించాలి

పీలేరు సర్పంచ్‌కు పంచాయతీ కార్మికుల వినతి



సర్పంచ్ హబీబ్ బాషాకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పీలేరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏడాది పైబడుతున్నా పెండింగ్ జీతాలు చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ పంచాయతీ కార్మికులు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషాకు విన్నవించారు. మంగళవారం సాయంత్రం పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకట్రామయ్య అధ్యక్షతన సర్పంచ్‌కు లిఖిత పూర్వక పిర్యాదు చేశారు. గతేడాది మే, జూన్ నెలలకు సంబంధించి 46 మంది కార్మికులకు రెండు నెలలు జీతాలు ఇప్పటి వరకూ చెల్లించలేదని ఆరోపించారు. కార్మికుల ఇబ్బందులపై స్పందించిన సర్పంచ్ హబీబ్‌బాషా మాట్లాడుతూ పెండింగ్ జీతాలు విషయమై కలెక్టర్, డీపీఓలతో సంప్రదించి వీలైనంత త్వరగా జీతాలు అందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నేతలు బీవీ. రమణ, చిట్టెమ్మ, సరోజ, మస్తాన్, పులి రెడ్డెప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

వేదపాఠశాల ఘటనపై డీఎస్పీ విచారణ



చూపుకోల్పోయిన బాలుడు శేషాద్రి

బి.కొత్తకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గట్టు పంచాయతీ పరిధిలోని వేదపాఠశాలలో ఈనెల 7న జరిగిన ఘటనపై మంగళవారం మదనపల్లి డీఎస్పీ మహేంద్ర విచారణ చేపట్టారు. ములకలచెరువు సీఐ వెంటేశ్వర్లుతో కలిసి పాఠశాలకు వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అందుబాటులో ఉన్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో చదువుతున్న లక్కిరెడ్డిపల్లి మండలం, కాలాడివారిపల్లికి చెందిన బాలుడు శేషాద్రిరెడ్డిపై దాడి జరగడంతో కుడి కంటికి తీవ్రగాయమైంది. తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించగా కనుపాప దెబ్బతినడంతో చూపు పోయినట్టేనని వైద్యులు పేర్కొనడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన బాలుడి తండ్రి అమరనాథరెడ్డి బి.కొత్తకోట పోలీసులకు పిర్యాదు చేశారు. ఏడాదికి రూ.70వేలు ఫీజు చెల్లిస్తున్నామని, ఈ ఏడాది ఫీజు చెల్లింపు ఆలస్యం అయినందున అక్కడ పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది వెంకటేష్ రాయిని శేషాద్రి వైపు విసరడంతో ఆ రాయి తగిలి కంటికి తీవ్రగాయంతో రక్తస్రావమై కనుచూపు పోయిందని పిర్యాదులో పేర్కొన్నాడు. తన కుమారుడు శాశ్వతంగా కనుచూపు కోల్పోయాడని, ఇందుకు కారణమైన రుషివాటిక గురుకుల పాఠశాల యాజమాన్యం, నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ మహేంద్ర రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. పాఠశాలలో విచారణ అనంతరం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడారు.

మహిళ ఆరోగ్యంతోనే శక్తిమంతమైన కుటుంబం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కావ్యగంధ

కలికిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళ సంపూర్ణ ఆరోగ్యంగా వుంటే ఆ కుటుంబం అన్ని విధాలా దృఢంగా వుంటుందని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కావ్యగంధ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరిస్తూ కొత్తగా అమలు చేయనున్న స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యమైన మహిళతో దృఢమైన కుటుంబం) పథకం గురించి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల శిక్షణలో ఆమె మాట్లాడుతూ ఈ పథకం గురించి విస్తృత ప్రచారం, మహిళలకు అవగాహన కలిగించడానికి రెండు వారాలు అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లోనూ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయానుకూలంగా వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాన్ని స్వయం శక్తివంతంగా చేయడానికి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో ఈ కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, సీహెచ్ఓ శాంతకుమారి, పర్యవేక్షకులు సుధాకర్, గిరిజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకుందాం

వాల్మీకిపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్'ను సద్వినియోగం చేసుకుందామని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జులేఖాబేగం అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వస్థ్‌నారి సశక్త్ పరివార్ అభియాన్‌ను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ అరుణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి, సూపర్‌వైజర్లు బహద్దీన్, బానుబీ, అంగన్వాడీ, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి : డీఎల్‌డీఓ

కలకడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వేను వేగవంతం చేసి 24వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచి తడి-పొడి చెత్తను సేకరించి డంపిగ్ యార్డులకు తరలించాలని సూచించారు. అక్టోబరు 2వ తేదీ నాటికి నిరుపయోగంగా వున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. కౌసలం సర్వేను అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. రాచవేటివారిపల్లి పంచాయతీలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించే సమయంలో మ్యాప్‌ను ఉపయోగించి ఖచ్చితమైన సర్వే చేపట్టాలన్నారు. ఇప్పటికే నాలుగు పంచాయతీలు పూర్తి కాగా మిగిలిన పంచాతీల్లో సిబ్బంది కొన్ని టీమ్‌లుగా ఏర్పడి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ రెండు రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ విచారణకు సిద్ధం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కురవంక పంచా యతీ అభివృద్ధిపై బహిరంగ విచారణ కు సిద్ధంగా వున్నా మని ఐటీయూసీ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు గొంగడి కృష్ణమూర్తి సవాల్ విసిరారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పంచాయతీలో అభివృద్ధి జరగలే దని కొందరు సర్పంచ్‌పై అభాండాలు వేయడం సరికాదన్నారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన మహిళ స్థానంలో బినామీగా వ్యహరించిన వ్యక్తి, ఆయన కుమారుడు అక్రమ కుళాయి కనెక్షన్లు ఇచ్చి రూ.20లక్షలు దోచుకున్నారన్నారు. ఇళ్ల ప్లాన్‌అప్రూవల్‌లో పంచాయతీకి కొంతే చెల్లించి లక్షల్లో దోచుకుతిన్న విషయం నిజంకాదా అని ప్రశ్నించారు. ప్రస్తుత సర్పంచ్ చలపతి నాలుగున్నరేళ్లలో రూ.3.5కోట్లు దాకా అభివృద్ధి పనులు చేసి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగరాజు, చంద్రకళ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ మండల సమావేశం

● పలు శాఖల అధికారులు గైర్హాజరు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు బందోబస్తు, ప్రొటోకాల్ నడుమ తంబళ్లపల్లె మండల సమావేశం ప్రశాంతంగా సాగింది. గతంలో జగరాల్సిన మండల సమావేశాలు ఉద్రిక్త పరిస్థితుల నడుమ నిలిచిపోయిన నేపథ్యంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం ఎస్ఐలు ఉమామహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన సమావేశాల్లో మహిళా ఎంపీటీసీలు, సర్పంచుల స్థానంలో వారి భర్తలు హాజరయ్యేవారు. మంగళవారం జరిగిన సమావేశంలో అటువంటి పరిస్థితి చోటు చేసుకోకుండా ఎస్ఐలు, ఎంపీడీఓ థామస్ రాజ గట్టి చర్యలు చేపట్టారు. పోలీసులు కార్యాలయం గేటు వద్ద ఉండి ప్రొటోకాల్ మేరకు సర్పంచులు, ఎంపీటీసీలను మాత్రమే లోపలికి అనుమతించారు. ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన ప్రశాంతంగా ప్రారంభమైన సమావేశంలో పలు శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దడం, నూతన రేషన్ కార్డులు, మార్పులు, చేర్పులను వివరించారు. వ్యవసాయ శాఖ వీఏఏ సురేష్, విద్యుత్ ఏఈ సురేంద్ర, విద్య, ఉపాధి, వెలుగు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశానికి గైర్హాజరు, ఆలస్యంగా రావడంపై ఎంపీడీఓ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యఆరోగ్య శాఖ, సోషల్ వెల్ఫేర్, ఎక్సైజ్, సహకార సంఘం(సింగిల్ విండో), ఏపీఎస్‌ఆర్టీసీ శాఖలు గైర్హాజరయ్యారు. హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు పంపిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డికి సన్మానం



సుబ్రహ్మణ్యం రెడ్డిని సన్మానిస్తున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంరెడ్డిని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు సన్మానించారు. కృతజ్ఞతలు తెలపడానికి నీరుగట్టువారిపల్లెలోని చినబాబు నివాసానికి వచ్చిన ఆయనను సత్కరించారు. ప్రభాకర్, కాశీ శ్రీరామ్, రెడ్డిశేఖర్ నాయుడు, మల్లెం ప్రకాష్‌నాయుడు, పసుపులేటి శ్రీనివాసులు, కలిశం ప్రకాష్‌నాయుడు, సికింధర్ బాబు, మేస్త్రీ శ్రీనివాసులు ఉన్నారు.

మహిళ భద్రత కోసమే స్త్రీశక్తి యాప్

వాల్మీకిపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళ భద్రత కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని సీఐ రాఘవ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్పీ ధీరజ్ కనుబిలి ఆదేశాల మేరకు స్త్రీశక్తి యాప్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ రక్షణ, భద్రత కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన స్త్రీశక్తి యాప్ క్లిష్ట సమయాల్లో తక్షణ సహాయానికి ఉపయోగపడుతుందన్నారు.

ఓజోన్‌ను విస్మరిస్తే మనుగడ ప్రశ్నార్థకమే



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అసోసియేట్ డీన్ శివయ్య

కురబలకోట,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్‌ను విస్మరిస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమేనని ఆర్‌అండ్‌డీ అసోసియేట్ డీన్ శివయ్య అన్నారు. మంగళవారం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూర్యుడు నుంచి వచ్చే కిరణాలను భూమిపై నేరుగా పడకుండా, అతినీలలోహిత కిరణాలను అడ్డుకునేది ఓజోన్ పొర అన్నారు. భూమిపై రసాయనాల వాడకంతో ఓజోన్ పొర దెబ్బతింటుందని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, రసాయనాల వాడకాన్ని తగ్గించి వాటిని కాపాడాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. విభాగాధిపతి రంజిత్ భాస్కరన్, కో ఆర్డినేటర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలి

● రైతులకు డీఏహెచ్ఓ గుణశేఖర్‌పిళ్లై సూచన



టీకాల కార్యక్రమం పరిశీలిస్తున్న గుణశేఖర్‌పిళ్లై

కలకడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులకు తప్పక గాలికుంటు వ్యాధి టీకాలను వేయించుకోవాలని డీఏహెచ్ఓ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. కొత్తపల్లిలో జరిగిన టీకాల కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, నీరసం, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, ఎండకు రొప్పడం, చూడి ఈసుకుపోవడం వంటి లక్షణాలు వుంటయన్నారు. దీంతో పాల ఉత్పత్తి తగ్గి పోవడం, పాలు తాగే దూడల్లో మరణాలు సంభవించి రైతుకు ఆర్థిక నష్టం జరుగుందన్నారు. జిల్లాకు కేటాయించిన 2,70,300 డోసుల టీకాలను సిబ్బంది బృందాలుగా ఏర్పడి రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆయన వెంట అధికారి క్రిష్ణయ్య, సిబ్బంది వున్నారు.

ఓజోన్ పొరను కాపాడాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో కాలుష్యాన్ని నియంత్రించి ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందని ప్రిన్సిపాల్ కృష్ణవేణి పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రిఫ్రిజిరేటర్స్, ఎయిర్‌కండీషన్ల వాడకం తగ్గించాలని, పచ్చని మొక్కలను నాటి, సంరక్షించాలన్నారు. రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ గురుమూర్తి, అధ్యాపకులు లీలా, అన్నపూర్ణ పాల్గొన్నారు.

స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ దెబ్బతింటున్న ఓజోన్ పొరను కాపాడి మానవాళిని రక్షించుకోవాలన్నారు. ఓజోన్ పొర దెబ్బతింటే అతినీలలోహిత కిరణాలతో మానవాళి, జంతు, వృక్షాల ప్రాణాలకే హాని వుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెన్నారెడ్డి, శైలజ, శ్రీనివాసులు, రాఘవరెడ్డి, అనూష, మాధవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఎప్పటికైనా అగ్రతాంబూలమే



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడితే ఎప్పటికైనా అగ్రతాంబూలం ఉంటుందని, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం నామినేటెడ్ పదవులు పొందిన వారికి అభినందించిన వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నేతలను ఎన్నో కష్టాలు పెట్టించి కేసుల్లో ఇరికించారని గుర్తు చేశారు. కొంత మంది వైసీపీ కోవర్టులు పార్టీలోకి వచ్చి తమను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేశారన్నారు. త్వరలోనే వైసీపీ కోవర్టులను బయట పెట్టి పార్టీని కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జున, విజయ్, చినబాబు, సుధాకర్, వెంకటరమణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు కొత్త ఈ పాస్ మిషన్ల పంపిణీ



ఈ పాస్ మిషన్ అందిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల డీలర్లకు ఈపాస్ మిషన్లను పంపిణీ చేపట్టినట్లు పీలేరు సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. నిత్యావసర సరుకుల పంపిణీ పారదర్శకంగా జరిగాలన్నారు. మంగళవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పీలేరు, కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాలకు చెందిన 174 మంది డీలర్లకు కొత్త ఈ పాస్ మిషన్లు పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా సరుకుల పంపిణీ వేగంగా జరగడం కోసం కొత్త 5జీ ఈపాస్ మిషన్లు ఇస్తోందన్నారు. ఏటీఎంలో డబ్బు తీసుకున్నట్లు చౌకదుకాణాల్లో సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. జిల్లా ఈ పాస్ మిషన్ల కోఆర్డినేటర్ భయ్యారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

బి.కొత్తకోట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమల నివారణ కోసం మంగళవారం నగర పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో దోమలు ఎక్కువై జనం జ్వరాల బారిన పడుతున్నారని పలువురు పట్టణ వాసులు కమిషనర్ పల్లవికి విన్నవించారు. దీంతో స్పందించిన కమిషనర్ దోమల నివారణకు మలాథిన్ ద్రావణం పిచికారీ, ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డిమస్తాన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా వాణి



నిమ్మనపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లి మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్‌గా నిమ్మనపల్లి వాసి పి.వాణిని ఎంపిక చేసినట్లు టీడీపీ అధిష్టానం నుంచి ఆదేశాలు అందాయి. మంగళవారం ఆమె మాట్లాడుతూ తన భర్త విజయ్‌కుమార్ పార్టీలో వుంటూ కష్టకాలంలో కూడా సేవలు అందిచారని, మా సేవలను గుర్తించిన అధిష్టానం డైరక్టర్‌గా అవకాశం కల్పించిందన్నారు.

దళిత రణభేరిని జయప్రదం చేయండి

ములకలచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని గాంధీనగర్ ధర్నా చౌక్‌లో 24వతేదీన జరిగే దళిత రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున పిలుపు నిచ్చారు. ములకలచెరువులో మంగళవారం రణభేరి కరపత్రాలు ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకులు మారుతున్నా దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు మాత్రం అగడం లేదన్నారు. దీన్ని నిరసిస్తూ బీఎస్పీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో దళితుల రణభేరి నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమానికి బీఎస్పీ నేతలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్ద ఎత్తున హాజరవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు వంశీ, మహేంద్ర, సంతోస్, గంగాద్రి, హరి, అశోక్, సురేష్, శంకర, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుర్రంకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురవడంతో వీఆర్వో శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నబీకాలనీ సమీప ఇంట్లో వీఆర్వో శంకర్ అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి ఇంటి ముందు ఉంచి నిద్రపోయాడు. సోమవారం ఉదయం లేచి చూడగా ద్విచక్ర వాహనం కనబడలేదు. దీంతో చుట్టు పక్కల, పరిసరాల్లో వెదికినా ద్విచక్ర వాహనం కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణంలో ఇండ్లలో, ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు కోర్టు ఆవరణలో వెలిసిన కోర్టులో గంగమ్మకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు తదితర సభ్యులు పాల్గొన్నారు.

రామాలయంలో విశేష పూజలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంతబజారు వీధిలో వెలిసిన రామాలయంలో విశేషపూజలు నిర్వహించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం నుంచీ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రామనామ హోమం చేశారు.